Follow: @mahaadaily
22-12-2025
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 363 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు



# జనవరి 28 నుంచి మేడారం మహా కుంభమేళా

## 2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

జాతర షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం

తెలంగాణ కుంభమేళాకు 3,495 ఆర్టీసీ బస్సులు, భారీ ఏర్పాట్లు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కుంభమేళా, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన "మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర 2026"కు ముహూర్తం ఖరారైంది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ మహా క్రతువుకు సంబంధించిన గోడ పత్రికను (పోస్టర్) ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం తన జూబ్లీహిల్స్ నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మంత్రి సీతక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమ్మక్క తల్లి కంకణం కట్టి, నుదుట బొట్టు పెట్టి అమ్మవార్ల ఆశీస్సులు అందజేశారు.

మిగతా 2లో


**టాప్ న్యూస్**

బిగ్‌బాస్ సీజన్9
### విజేత కల్యాణ్ పడాల
- రూ.35 లక్షల ప్రైజ్ మనీ




03

తెలంగాణలో
### సర్
- సీఈసీ జ్ఞానేష్ కుమార్
- 50 లక్షల ఓట్ల కోతకు ఛాన్స్



02

ఫామ్‌హౌజ్‌లో
### చలి ఎక్కువై కేసీఆర్ బయటకొచ్చారు
- కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ విమర్శలు



03



## థాంక్యూ షర్మిలమ్మ

బర్త్ డే విషెస్ ట్వీట్ కు జగన్ రిప్లయ్

**మహా:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆదివారం పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియాలో జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు జగన్ పుట్టినరోజును ఘనంగా జరిపాయి. అనేక మంది ప్రముఖులతో పాటు ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కూడా తన సోదరుడికి బర్త్ డే విషెస్ తెలిపారు. భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని ట్వీట్ చేశారు. షర్మిల ట్వీట్ కు జగన్ స్పందించారు. థాంక్యూ షర్మిలమ్మ అంటూ రిప్లయ్ ఇచ్చారు. జగన్ స్పందనతో వైసీపీ అభిమానులు ఆనందంతో పొంగిపోతున్నారు. గత కొంతకాలంగా జగన్, షర్మిల మధ్య విభేదాలు తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ పుట్టినరోజు సందర్భంగా షర్మిల శుభాకాంక్షలు తెలపడం, జగన్ కూడా షర్మిలమ్మ అంటూ స్పందించడం అభిమానులను ఆనందానికి గురిచేసింది.

## బ్యాట్ పట్టిన నారా బ్రాహ్మణి

ఎంపీఎల్ -4 ప్రారంభం



**మంగళగిరి, మహా:** యువయంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి బ్యాట్ పట్టారు. క్రికెట్ ఆడుతూ అభిమానులను ఉత్సాహపరిచారు. జనవరిలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజును పురస్కరించుకొని మంగళగిరిలో ఎంపీఎల్ 4 క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఆదివారం నారా బ్రాహ్మణి, ఎంపీ సానా సతీష్, సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ఈ పోటీలను ప్రారంభించారు. నేటి నుంచి జనవరి 21 వరకు జరగనున్న ఈ పోటీల్లో మొత్తం 125 టీమ్‌లు పాల్గొంటున్నాయి. ఇవాళ మ్యాచ్‌ను నారా బ్రాహ్మణి టాస్ వేసి ప్రారంభించారు. అంతకుముందు బ్రాహ్మణి, నటుడు నిఖిల్ సరదాగా కొద్దిసేపు క్రికెట్ ఆడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఏర్పాటుచేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు.




# నేనే వస్తా

## ప్రభుత్వానికి రెండేళ్ళ సమయం ఇచ్చాం

అటు గోదావరి.. ఇటు కృష్ణాజలాల్లో చంద్రబాబు దోపిడీని పట్టించుకోట్లే

పాలమూరు రంగారెడ్డిలో పైసా పని చేయలే..

చంద్రబాబు ఒత్తిడితో కేంద్రం డీపీఆర్ తిప్పిపంపింది

పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డిలకు అన్యాయం సహించం

పాలమూరుపై కేంద్రాన్ని ఎండగట్టి పెద్దఎత్తున ఉద్యమిస్తాం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధ్వజం

### ఇయ్యాల్టి దాకా ఒక కథ రేపటి నుండి మరో కథ

**హైదరాబాద్, మహా:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తెలంగాణకు ద్రోహం చేస్తున్నాయని.. ఇయ్యాల్టి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క ఉంటుందని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రకటించారు. తాము చూస్తూ ఊరుకోబోమన్నారు. రెండేళ్లు ఆగామని.. ఇకపై ప్రభుత్వాన్ని అడుగడునా నిలదీస్తామన్నారు. బహిరంగ సభలు పెడతామని.. జనంలోకి తానే నేరుగా వస్తానని ప్రకటించారు. ఇకపై రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని కేసీఆర్ ప్రకటించారు. ఇంట్లోకి వచ్చి దోచుకుపోతామంటే ఊరుకుంటామా? అని ప్రశ్నించారు. 50 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్, 20 ఏళ్లు పాలించిన టీడీపీ ప్రభుత్వాలు పాలమూరు జిల్లాకు తీరని ద్రోహం చేశాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యవర్గ సమావేశంలో ప్రధాన ఎజెండా పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు అంశంపైనే జరిగిందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రం పాలమూరు ప్రాజెక్టుకు చేసిన ద్రోహంపైనే ఈరోజు సమావేశంలో చర్చించామని వెల్లడించారు. సమైక్య రాష్ట్రంలో ఎక్కువ అన్యాయానికి గురైన జిల్లా పాలమూరేనని, 174 టీఎంసీల నీరు పాలమూరు జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టులకు రావాల్సి ఉందని కేసీఆర్ అన్నారు. పాలమూరు జిల్లాలో కృష్ణానది 300 కిలో మీటర్లు ప్రవహించినా అప్పట్లో 30 వేల ఎకరాలకు సాగునీరు అందలేదని కేసీఆర్ వివరించారు.

మిగతా 2లో



### క్రైమ్ రేట్ పెరిగింది

ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సర్వభ్రష్ట ప్రభుత్వమని కేసీఆర్ మండిపడ్డారు. జంటనగరాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నా అడిగే దిక్కులేదన్నారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారమే తెలంగాణలో 20శాతం క్రైమ్‌రేట్ పెరిగిందన్నారు. పచ్చి అబద్ధాల వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటే తెలంగాణ, ప్రత్యేకించి పాలమూరు పాలిట పెనుశాపంగా మారిందని కేసీఆర్ అన్నారు.

# కేసీఆర్.. అసెంబ్లీకి రా నీటివాటాలపై చర్చిద్దాం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్

### కొడుకు అల్లుడు కొట్టుకుంటున్నారని కేసీఆర్ బయటకు వచ్చిండు

ముఖాముఖి చర్చంటే ముఖం చాటేసేదే కేసీఆర్

చంద్రబాబు అసలు శిష్యుడు కేసీఆరే

మూడుజిల్లాలకు మరణశాసనం రాసిందే కేసీఆర్..

పదేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు

కేసీఆర్, కేటీఆర్ ఆర్థిక ఉగ్రవాదులు



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని నదీ జలాలపై చర్చిద్దామని.. అందుకోసం అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ఇప్పటికైనా బయటకు రావడం చాలా సంతోషకరమని, కొడుకు, అల్లుడు కొట్టుకుంటున్నారని కేసీఆర్ బయటకు వచ్చాడన్నారు.. మీడియా సమావేశంలో కేసీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం రియాక్ట్ అయ్యారు. ముఖాముఖి చర్చలకు రమ్మంటే ముఖం చాటేస్తున్నాడు. కుర్చీ కోసం అల్లుడు కొడుకు కేసీఆర్ చావు కోరుకుంటున్నారు. కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

మిగతా 2లో

## ఇరిగేషన్‌ను ధ్వంసం చేసిందే కేసీఆర్

- తెలంగాణను సర్వనాశనం చేశారు
- పదేళ్ళలో పాలమూరు ఎందుకు పూర్తిచేయలేదు?
- ఒక్క ఎకరాకు నీరివ్వకుండా 90శాతం పూర్తయిందా?
- ప్రాణహిత చేవెళ్ళను పక్కనబెట్టి రంగారెడ్డికి ద్రోహం చేసిందే కేసీఆర్
- కేసీఆర్ వ్యాఖ్యలపై భగ్గుమన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్. మహా:** తెలంగాణ ఇరిగేషన్ వ్యవస్థను సర్వనాశనం చేసిందే కేసీఆర్ అని, నోటికొచ్చింది మాట్లాడుతూ అబద్ధాలు చెప్పడం ఆయనకు అలవాటని.. దమ్ముంటే చర్చకు

మిగతా 2లో


## రంగంలోకి సజ్జనార్

### ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

- ప్రతి ఒక్కరినీ విచారించాలని ఆదేశం
- కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా సిట్ కీలక భేటీ
- మూలాలను వెలికితీసే పనిలో సజ్జనార్ టీమ్

02










# నేనే వస్తా..

(మొదటిపేజీ తరువాయి)

బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ముందు తాము చాలా వాదించి, ఉద్యమ సమయంలో పాలమూరుకు జరిగిన అన్యాయం వివరించినట్లు తెలిపారు. సమైక్య రాష్ట్రంలోనే సమగ్రాభివృద్ధి పేరిట చంద్రబాబు సభలు పెట్టారన్నారు. జూరాల ప్రాజెక్టు కోసం పరిహారం డబ్బు చంద్రబాబు కట్టడం లేదని తన విమర్శలకు తట్టుకోలేక కర్ణాటకకు డబ్బు చెల్లించారన్నారు. పాలమూరు జిల్లాకు 170 టీఎంసీలు తీసుకెళ్లాలన్నది బీఆర్ఎస్ సర్కారు వ్యూహమని, దానిలో భాగంగా చెరువుల లెక్కలు తీసి కేంద్రానికి సమర్పించామన్నారు. తాము పాలమూరు జిల్లాకు 90.81 టీఎంసీలు కేటాయించామన్నారు. పట్టిసీమ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 80 టీఎంసీల గోదావరి నీరు వాడుకుంటోందని చెప్పారు. ఆ 80 టీఎంసీలు బచావత్ ట్రైబ్యునల్ ద్వారా ఎగువ రాష్ట్రాలకు ఇస్తామని ఏపీ చెప్పిందని గుర్తుచేశారు. కర్ణాటక, మహారాష్ట్ర చెరో 20 టీఎంసీలు వాడుకుంటుండగా తెలంగాణకు రావాల్సిన 45 టీఎంసీలు పాలమూరుకు వాడుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇపుడు ఆ డిపిఆర్ కేంద్రంలోని తన పలుకుబడితో చంద్రబాబు తిప్పి పంపినా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు.

**సభలకు నేనే వస్తా**

ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందాలే తప్ప.. వేరే ధ్యాసే లేదని కాంగ్రెస్ సర్కార్‌పై కేసీఆర్ విమర్శలు గుప్పించారు. సర్కార్ విధానాలను ఎక్కడికక్కడ నిలదీస్తామని.. అన్యాయాలపై ప్రశ్నిస్తామన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన వడ్లు కొనే దిక్కు లేదు.. యూరియా ఇచ్చే సిస్టమ్ లేదని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగమాగం చేస్తుందన్నారు. వీరి పాలనా విధానాలు గమనిస్తుంటే.. అసలు తెలంగాణలో ప్రభుత్వం ఉందా? నిద్రపోతుందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. ఎంతసేపు భూములు అమ్ముకుందామనే యావలోనే ఉంటే ఎలా? అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. పాలమూరు ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగడతామని, ఉద్యమాలు చేపడతామన్నారు. భారీ బహిరంగ సభలు పెడతామని.. తాను ఆ సభకు హాజరవుతానని కేసీఆర్ చెప్పారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే.. ప్రభుత్వం నోరుమూసుకుని ఉంటుందని.. అందుకే తాము ముందడుగు వేస్తామన్నారు.

**చైనా తరహాలో ఫార్మాసిటీ ప్లాన్**

చైనా తరహాలో ఫార్మా సిటీ కట్టాలని తాము భూమి సేకరించామని, 400ఏళ్ల చరిత్రతో హైదరాబాద్ వైబ్రాంట్ సిటీ అయ్యిందని కేసీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మా సిటీ ప్లాన్ చేశామన్నారు ఫ్యూచర్ సిటీ పేరుతో జరిగేదంతా రియల్ఎస్టేట్ దందానే అని విమర్శలు గుప్పించారు. ఫార్మా సిటీ కోసమే వాడతామన్న నిబంధనతో భూసేకరణ చేశామన్నారు. బిజినెస్ మీటింగ్‌లకు ఆద్యుడు చంద్రబాబని, ఆయన మొదటిసారి సీఎం అయినప్పుడు విశాఖలో బిజినెస్ మీటింగ్ పెట్టారన్నారు. అప్పట్లో విశాఖ ఎంవోయూల్లో 20లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారని, కానీ వంట మనుషులు సంతకాలు పెట్టారు, అవన్నీ నిజమైతే లక్షల కోట్ల పెట్టుబడులు రావాలి కదా ప్రశ్నించారు. బిజినెస్ మీటింగ్ లు పెట్టలేదు : తాము బిజినెస్ మీటింగ్‌లు పెట్టలేదన్న కేసీఆర్ మంచి పాలసీలతోనే పెట్టుబడుదారుల్నీ ఆకర్షించినట్లు తెలిపారు. గతంలో ఫాక్స్‌కాన్ కంపెనీ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తే రూ.3,000 కోట్లు ఎదురు ఇస్తామని మహారాష్ట్ర తీసుకుపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఇవ్వలేదని ఇక కోటీశ్వరులను ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు. తాము భూముల ధరలు పెంచగలిగామని నాలుగు ఎకరాలు ఉన్నవాడు ధీమాగా ఉండేవాడని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో భూముల ధరలు కుప్పకూలాయన్న కేసీఆర్ రైతులను, ఉద్యోగులను అందరినీ ఏడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. అప్పులు కట్టలేకపోతున్నామని అంటే కాగ్ చెంపలు వాయించిందని గుర్తుచేశారు. ఎక్కడ మాట్లాడినా కేసీఆర్ చచ్చిపోవాలనే మాట్లాడతారా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడో కోపం వస్తే ఒక మాట అనొచ్చు కానీ ప్రతిసారీ నాపైనే శాపనార్థాలు పెడతారా? అని ఆక్షేపించారు.



## కేసీఆర్.. అసెంబ్లీకి రా

# నీటివాటాలపై చర్చిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

రా డాక్యుమెంట్లతో సహా నిరూపిస్తా అని రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇరిగేషన్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు 90శాతం అబద్ధమని అన్నారు. కాళేశ్వరం తెలంగాణకు గుండెకాయ అన్నారని.. అది కూలిపోయిందని చెప్పుకొచ్చారు. రూ.1. 80లక్షల కోట్లతో కట్టిన ప్రాజెక్టు వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోవడానికి కారణం.. కేసీఆరేనని ఫైర్ అయ్యారు. ప్రజల భవిష్యత్తును ఆయన తాకట్టు పెట్టారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం తీరును డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సుప్రీం కోర్టు జడ్జి కూడా తప్పుపట్టారని ప్రస్తావించారు. కూలిపోయిన ప్రాజెక్టులు కట్టి ఇరిగేషన్ గురించి కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రూ.38,500కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు ఎందుకు పెంచారని ప్రశ్నల వర్షం కురిపించారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా పెంచారని ఆరోపించారు. రూ.18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. రూ.లక్షల కోట్ల అప్పుతెచ్చి కూడా ప్రాజెక్టు పూర్తి చేయలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న పెండింగ్ ప్రాజెక్టులు కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు? అని ప్రశ్నించారు. ఎస్ ఎల్ బిసి, డిండి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలు అడుగుతున్నారని.. కేసీఆర్ వెంటనే సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని తేల్చిచెప్పారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు.



**మీ వల్లే నాశనం**

కృష్ణా జలాల కోసం గట్టిగా ట్రైబ్యునల్‌లో పోరాడుతున్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. ఈ ప్రాజెక్టుకు 90 టీఎంసీల కంటే తక్కువ అడగ లేదని అన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రద్దు చేసి రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ తప్పుల వల్లే ఇరిగేషన్ వ్యవస్థ నాశనమైందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. 91వేల కోట్లు 11శాతం వడ్డీకి తెచ్చిన నాయకుడు కేసీఆర్ అని, వాటివల్ల ఏ మాత్రం ఉపయోగం లేకుండా చేశారన్నారు. ఆ అప్పులను రీస్ట్రక్చర్ చేసి 11శాతం వడ్డీ నుండి 7 శాతానికి తీసుకొచ్చామన్నారు. సిగ్గులేకుండా నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నారన్నారు.

## ఇరిగేషన్‌ను ధ్వంసం చేసిందే కేసీఆర్



(మొదటిపేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికలపై నిజనిర్ధారణ కమిటీ వేద్దాం.. ఎవరికి ఎన్ని వచ్చినయో తెలుస్తది కదా అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అత్యధికంగా జల దోపిడి జరిగిందని ఆయన విమర్శించారు. మూడు జిల్లాలకు మరణ శాసనం రాసిందే కేసీఆర్ అని ఆయన స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డికి జూరాల నుంచి నీటిని తీసుకుంటే మన హక్కులు మనకు ఉండేవని ఆయన పేర్కొన్నారు. .ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే నీటి వాటాల విషయంలో తెలంగాణ అన్యాయం జరిగిందని సీఎం అన్నారు. చెప్పిన అబద్దాలు చెప్పకుండా.. అబద్దాలనే పెట్టుబడిగా మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే ఎక్కువ జలదోపిడీ జరిగిందన్నారు. పదేళ్లలో కృష్ణ మీద కేసీఆర్ ఒక ప్రాజెక్టు కట్టలేదని, కాంట్రాక్టర్లకు ముడుపోయి కేసీఆర్ వేలకోట్ల కమిషన్లు దండుకున్నాడన్నారు.

**జనవరి 2 నుండి అసెంబ్లీలో చర్చిద్దాం**

"811 టీఎంసీల నికర జలాల్లో 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది కేసీఆరే. నీటి వాటాలపై సంతకం చేసి 3 జిల్లాలకు మరణ శాసనం రాశారు. కృష్ణా జలాల్లో 71శాతం వాటా కావాలని కొట్లాడుతున్నాం. ఏపీ జలదోపిడీకి దోహదం చేసింది కేసీఆరే. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు. కృష్ణా జలాల్లో సగం వాటా కావాలని కేసీఆర్ అడగలేదు. కృష్ణా, గోదావరి జలాల వాటాపై జనవరి 2 నుంచి అసెంబ్లీలో చర్చిద్దాం. కేసీఆర్, కేటీఆర్ ఆర్థిక ఉగ్రవాదులు. అసెంబ్లీ సమావేశాలకు రావాలని కేసీఆర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా. ఇప్పటికైనా ప్రతిపక్ష నేత బయటకు రావడాన్ని స్వాగతిస్తున్నా" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# తెలంగాణలో సర్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ పర్యటనలో ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓ) నిర్వహించిన సమావేశం చర్చనీయాంశంగా మారింది. ఓటర్ల పరంగా తెలంగాణ రాష్ట్రం 'కెనడా' దేశం కంటే పెద్దదని, ఇక్కడ ఒక్కో బీఎల్ఓ సగటున 930 మంది ఓటర్ల బాధ్యతను మోయాల్సి ఉంటుందని ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ ప్రక్రియలోని తీవ్రతను, సవాల్‌ను కళ్లకు కడుతున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ ఎస్ఐఆర్ ప్రక్రియను తెలంగాణలోనూ విజయవంతం చేయాలని ఆయన పిలుపునివ్వడం ద్వారా ప్రక్షాళన పర్వానికి అధికారికంగా తెర లేపారు. అయితే, ఈ 'స్వచ్ఛ' భారత్ ఓటర్ల జాబితా తయారీ వెనుక దాగి ఉన్న రాజకీయ పరిణామాలు ఇప్పుడు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య యుద్ధానికి దారితీస్తున్నాయి. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ముగిసిన తీరు చూస్తుంటే, తెలంగాణలోనూ అదే స్థాయిలో 'ఓట్ల కోత' తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. తమిళనాడులో రికార్డు స్థాయిలో 97.37 లక్షల ఓట్లు (సుమారు 15.2 శాతం), పశ్చిమ బెంగాల్‌లో 58.21 లక్షల ఓట్లు (సుమారు 7.5 శాతం) తొలగించబడటం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. ఆయా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, అగ్రనేతలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టడం, కేంద్ర ప్రభుత్వం వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వాలుగా అధికారులు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారన్న ఆరోపణలు ఇప్పుడు తెలంగాణ ఉద్యోగుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. తెలంగాణ విషయానికి వస్తే, 2025 సెప్టెంబర్ నాటికి రాష్ట్రంలో సుమారు 3.35 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1.68 కోట్ల మంది మహిళా ఓటర్లు, 1.66 కోట్ల మంది పురుష ఓటర్లు కాగా, థర్డ్ జెండర్ ఓటర్లు 2,829 మందిగా రికార్డయ్యారు. తాజా ఎస్ఐఆర్ ఆపరేషన్‌లో దాదాపు 50 లక్షల ఓట్లు ఎగిరిపోయే అవకాశం ఉందని అధికారిక వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బిహార్ ఎన్నికల సమయంలో ఓట్ల ప్రక్షాళన వల్లే తాము నష్టపోయామని, అక్కడ 68.5 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన 'ఓటు చోరీ' ఆరోపణలు ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశంగా మారాయి. జూన్ 2024 నుంచి సెప్టెంబర్ 2025 మధ్య కాలంలో బిహార్‌లో ఓటర్ల సంఖ్య 6 శాతం తగ్గిపోవడం, అది చివరకు సుప్రీం కోర్టు గడప తొక్కడం వంటి పరిణామాలు ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తున్నాయి.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల కార్యదర్శుల పనితీరుపై లోతైన విశ్లేషణ పూర్తి చేశారు. ఈ నెలాఖరులోగా కేంద్ర ఎన్నికల సంఘం 'సర్' షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉండటంతో, ఆలోపే భారీగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. షెడ్యూల్ ప్రకటించాక ఎన్నికల సంఘం ఆంక్షలు అమల్లోకి వస్తాయి కాబట్టి, ఆలోపే తమకు నమ్మకమైన అధికారులను కీలక స్థానాల్లో నియమించుకోవాలని సర్కార్ భావిస్తోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలు ముగిసి, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో, ఈ ఓటర్ల జాబితా మార్పులు స్థానిక సంస్థల ఫలితాలపై పెను ప్రభావం చూపనున్నాయి.

# రంగంలోకి సజ్జనార్

## ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

- ప్రతి ఒక్కరినీ విచారించాలని ఆదేశం
- కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా సిట్ కీలక భేటీ
- మూలాలను వెలికితీసే పనిలో సజ్జనార్ టీమ్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన వేగాన్ని పెంచింది. ఈ కేసును అత్యంత కీలకంగా భావిస్తున్న ప్రభుత్వం, సమగ్ర విచారణ కోసం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సిట్, ఆదివారం నాడు హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అత్యున్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. ఈ భేటీలో సిట్ చైర్మన్ సజ్జనార్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేస్తూ, ఈ ఉదంతంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ విచారించి తీరాలని స్పష్టం చేశారు.ఎవరినీ వదిలిపెట్టకుండా లోతైన దర్యాప్తు జరిపి, పటిష్టమైన సాక్ష్యాధారాలతో కూడిన పూర్తి స్థాయి ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేయాలని ఆయన నిర్ణయించారు. ఈ కేసు దర్యాప్తును ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించేందుకు తొమ్మిది మంది అనుభవజ్ఞులైన అధికారులతో కూడిన పటిష్టమైన బృందాన్ని ప్రభుత్వం రంగంలోకి దించింది. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్.ఎమ్. విజయ్‌కుమార్, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, మాదాపూర్ డీసీపీ రితిరాజ్, మహేశ్వరం డీసీపీ కె.నారాయణ రెడ్డి వంటి సీనియర్ ఐపీఎస్ అధికారులతో పాటు గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ ఎం. రవీందర్ రెడ్డి ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. వీరికి తోడుగా రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ కేఎస్ రావు, కేసు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ జీహెచ్ శ్రీధర్, హెచ్ఎంఆర్ఎల్ డీఎస్పీ నాగేందర్ రావు తమ సేవలందించనున్నారు. సమావేశంలో సజ్జనార్ సిట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటివరకు జరిగిన విచారణ పురోగతిని సమీక్షించడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో తెరవెనుక ఉన్న వ్యక్తులు ఎంతటి వారైనా సరే చట్టం ముందు నిలబెట్టాలని, సాంకేతిక ఆధారాలను పక్కాగా సేకరించాలని సూచించారు. ఈ కేసులో సాక్ష్యాల తారుమారుకు తావులేకుండా పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి, త్వరలోనే తుది నివేదిక సిద్ధం చేయాలని బృందానికి ఆదేశాలిచ్చారు. సిట్ తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరిన్ని సంచలన నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# రాష్ట్రపతి నిలయంలో బ్రహ్మానందం సందడి

## ద్రౌపది ముర్ముకు ప్రత్యేక గిఫ్ట్

**హైదరాబాద్, మహా :** శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రముఖ సినీ నటుడు, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన 'ఎట్ హోమ్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతిని శాలువాతో సత్కరించిన బ్రహ్మానందం, ఆమెకు ఓ అపురూపమైన కానుకను అందజేశారు. తాను స్వయంగా పెన్సిల్ స్కెచ్‌తో లిఖించిన ఆంజనేయ స్వామి చిత్రాన్ని బ్రహ్మానందం రాష్ట్రపతికి బహూకరించారు. వెండితెరపై నవ్వులు పూయించే బ్రహ్మానందం, తనలోని చిత్రకారుడి నైపుణ్యాన్ని చాటుతూ భక్తిభావంతో గీసిన ఈ చిత్రాన్ని చూసి రాష్ట్రపతి ముర్ము ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె చిత్రపటాన్ని స్వీకరించి బ్రహ్మానందాన్ని అభినందించారు. ఈ ఆత్మీయ కలయిక అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంది.



# ఆర్టీసీకి మహాలక్ష్మి కళ

- లాభాల దిశగా ప్రజా రవాణా సంస్థ పయనం
- భారీగా తగ్గిన పీఎఫ్, సీసీఎస్ బకాయిలు
- గురుకులాల నిర్వహణకు రూ.152 కోట్లు విడుదల
- సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, మహా:** ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఆర్టీసీ రూపురేఖలను మార్చేసింది. మహిళా ప్రయాణికుల తాకిడి పెరగడం, ప్రభుత్వం నుంచి సకాలంలో సహకారం అందుతుండటంతో ఆర్టీసీ ఆర్థికంగా బలపడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు మహాలక్ష్మి పథకం ద్వారా 255 కోట్ల ఉచిత ప్రయాణాలు (జీరో టికెట్లు) నమోదయ్యాయని, ఇది మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా రుణాలు సమీకరించి కొత్త బస్సులను కొనుగోలు చేశామని, తద్వారా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచామని వివరించారు. ఇదే స్ఫూర్తితో సంస్థ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**గత పాప ప్రక్షాళన.. బకాయిల తగ్గింపు**

గత పాలకులు ఆర్టీసీని అప్పులపాలు చేశారని, కార్మికుల దాచుకున్న డబ్బును సైతం వాడేశారని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చాక ఆ భారాన్ని క్రమంగా దించుతున్నామని చెప్పారు. గతంలో రూ.1400 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను కేవలం రెండేళ్లలో రూ.660 కోట్లకు తగ్గించామన్నారు. అలాగే రూ.600 కోట్ల సీసీఎస్ బకాయిలను రూ.373 కోట్లకు పరిమితం చేశామని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**అందరికీ స్మార్ట్ కార్డులు.. ఈ-బస్సులు**

ఉచిత ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు 'సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెన్స్' సహకారంతో మహిళలందరికీ ప్రత్యేక స్మార్ట్ కార్డులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి మహిళకు ఈ కార్డు అందేలా చూడాలన్నారు. మరోవైపు కాలుష్య నివారణే లక్ష్యంగా పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్‌కు 2800 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయని, వరంగల్, నిజామాబాద్ నగరాలకు 100 చొప్పున కేటాయించామని తెలిపారు. వీటికి సంబంధించిన చార్జింగ్ స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు.

**విద్యార్థులకు భరోసా**

సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థుల కడుపు నింపేందుకు మెస్, కాస్మోటిక్ చార్జీలను ఏకంగా 200 శాతం పెంచామని భట్టి గుర్తుచేశారు. నిధుల కొరత లేకుండా ప్రతి మూడు నెలలకోసారి బిల్లులు క్లియర్ చేస్తున్నామన్నారు. తాజాగా గురుకులాల అద్దెలు, ఇతర అవసరాల కోసం రూ.152 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. గతంలో 327 గురుకులాల్లో 26 మాత్రమే సొంత భవనాల్లో ఉండేవని, ఇప్పుడు వంద ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో నిర్మిస్తున్నామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం స్కూల్ తెరిచే తొలిరోజే విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు చేతిలో ఉండాలని ఫైనాన్స్ సెక్రటరీని ఆదేశించారు. నాయి బ్రాహ్మణ, రజక కులాలకు ఉచిత విద్యుత్ బకాయిలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

**నియామకాలపై మంత్రి పొన్నం వినతి**

రవాణా, ఆర్టీసీ శాఖల్లో ఖాళీల భర్తీకి అనుమతివ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిప్యూటీ సీఎంను కోరారు. 2026 మార్చి నాటికి 3,233 కండక్టర్ పోస్టుల అవసరం ఉందని, ఇందులో సగం రెగ్యులర్, మిగతావి తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నారు. అలాగే అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ల నియామకం, రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం కొత్త వాహనాలు, ట్యాబ్లు కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# శంకర్ దాదాలా మారితే రోగులకు ప్రమాదమే

- వైద్య వృత్తి వ్యాపారం కాకూడదు.. సేవే పరమావధి కావాలి
- ఆ రోజు 12 సార్లు షాక్ ఇచ్చి నన్ను బతికించారు
- ఎంబీబీఎస్ అంటే ట్వంటీ-20 కాదు.. ఓపికతో ఆడే టెస్ట్ మ్యాచ్
- వైద్యంపై కార్పొరేట్ నీడ పడొద్దు.. మెడికోలకు కేంద్రమంత్రి బండి సంజయ్ హితవు



**హైదరాబాద్, మహా:** సమాజంలో దైవంతో సమానంగా పూజించే వైద్య వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు, భవిష్యత్తులో కార్పొరేట్ శక్తుల ప్రభావానికి లోనుకాకూడదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హితవు పలికారు. కరీంనగర్‌లోని ప్రతిమ వైద్య కళాశాల 24వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన, వైద్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఫార్మా కంపెనీలు, డయాగ్నస్టిక్ సెంటర్ల ప్రలోభాలకు లొంగిపోయి పేద ప్రజలకు అన్యాయం చేయవద్దని కోరారు. వైద్య రంగంలో కొత్తగా వస్తున్న మార్పులను గమనిస్తూ అప్‌డేట్ కాకపోతే, సినిమాల్లో చూపించే 'శంకర్ దాదా' పాత్రల్లా మారే ప్రమాదం ఉందని, అదే జరిగితే రోగులను కాపాడటం బదులు వైకుంఠానికి పంపినట్లవుతుందని చమత్కరించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలకు ప్రతిమ వైద్య కళాశాల అందిస్తున్న సేవలను బండి సంజయ్ ఈ సందర్భంగా ప్రశంసించారు. గత 24 ఏళ్లుగా ఈ సంస్థ ఎంతో ఎత్తుకు ఎదిగిందని, ముఖ్యంగా 'తల్లి బిడ్డ సంక్షేమ పథకం' ద్వారా కేవలం రెండు వేల రూపాయలకే గర్భిణీలకు కాన్పు వరకు పూర్తి వైద్యం అందిస్తుండటం అభినందనీయమని అన్నారు. ఇక్కడ చదువుతో పాటు విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తుండటం వల్లే సీట్లకు ఇంత డిమాండ్ ఏర్పడిందని పేర్కొన్నారు. వైద్య విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎంబీబీఎస్ చదువును ట్వంటీ20 మ్యాచ్‌తో పోల్చలేమని, ఇది ఐదేళ్ల పాటు సాగే టెస్ట్ మ్యాచ్ లాంటిదని అభివర్ణించారు. రాత్రులు నిద్రలేకుండా చదవడం, క్లిష్టమైన సబ్జెక్టులతో కుస్తీ పడటం, మానసిక ఒత్తిడికి గురవ్వడం ఇవన్నీ ఒక వైద్య విద్యార్థి జీవితంలో భాగమేనని చెప్పారు. అయితే, భవిష్యత్తులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని బతికించినప్పుడు కలిగే తృప్తి ముందు ఈ కష్టాలన్నీ చిన్నవిగా అనిపిస్తాయని విద్యార్థులలో ధైర్యం నింపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తన జీవితంలో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. గతంలో ఒక ర్యాలీలో గుండెపోటుతో కుప్పకూలినప్పుడు, కరీంనగర్ వైద్యులే తనను కాపాడారని తెలిపారు. ఆ సమయంలో తనకు 12 సార్లు షాక్ ఇచ్చారని, ఐదు రోజుల పాటు ఐసీయూలో ఉంచి పునర్జన్మ ప్రసాదించారని చెప్పారు. అమ్మ జన్మనిస్తే, డాక్టర్లు పునర్జన్మనిస్తారనడానికి తానే నిదర్శనమని, అందుకే వైద్యులంటే తనకు అమితమైన గౌరవమని పేర్కొన్నారు. అయితే, కోవిడ్ సమయంలో కొన్ని ఆసుపత్రులు మానవత్వం మరిచి ప్రవర్తించడం బాధాకరమని అన్నారు. డబ్బు చెల్లించలేదని చికిత్స నిలిపివేసిన ఘటనలు పునరావృతం కాకూడదని ఆకాంక్షించారు. దేశంలో వైద్య సదుపాయాల కొరత గురించి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలకులు ఈ రంగాన్ని విస్మరించారని విమర్శించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన పడకల సంఖ్యకు, మన దేశంలో ఉన్నవాటికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు ఇంకా మెరుగుపడాల్సి ఉందని, అక్కడి మౌలిక వసతులను ప్రభుత్వాలు అభివృద్ధి చేస్తే డాక్టర్లు పల్లెల్లో సేవ చేయడానికి ముందుకొస్తారని అభిప్రాయపడ్డారు. ఎంబీబీఎస్ తర్వాత పీజీ సీట్ల కొరత, అధిక ఫీజుల భారం వల్ల చాలామంది ప్రతిభావంతులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, దీనిపై విధానపరమైన మార్పులు రావాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ అన్నారు. ఏ రంగంలోనైనా నిజాయితీ, నిబద్ధత ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, ఇందుకు తానే ఉదాహరణని చెప్పారు. ప్రజల పక్షాన పోరాటం చేయడం వల్లే తనపై వందకు పైగా కేసులు నమోదయ్యాయని, ఆ పోరాట పటిమే తనను కేంద్ర మంత్రిగా నిలబెట్టిందని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు.

# జనవరి 28 నుంచి మేడారం మహా కుంభమేళా





(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొని జాతర ఏర్పాట్లపై చర్చించారు. వనదేవతల దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. నాలుగు రోజుల పాటు సాగే ఈ జాతర షెడ్యూల్‌ను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం మొదటి రోజైన జనవరి 28 (బుధవారం) నాడు ప్రారంభమవుతుంది. ఆ రోజున కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు మేడారంలోని గద్దెలపైకి చేరుకోనున్నారు. రెండో రోజైన జనవరి 29న చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. మూడవ రోజైన జనవరి 30న భక్తులు అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకోనున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకునే భక్తులతో మేడారం పరిసరాలు జనసంద్రం కానున్నాయి. చివరి రోజైన జనవరి 31న సాయంత్రం 6 గంటలకు అమ్మవార్లను తిరిగి వనప్రవేశం చేయించడంతో ఈ మహా జాతర ఘనంగా ముగియనుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ భారీ కార్యాచరణను ప్రకటించింది. జాతర కోసం ప్రత్యేకంగా 3,495 బస్సులను నడపనున్నట్లు స్పష్టం చేసింది. జనవరి 25వ తేదీ నుంచే ఈ ప్రత్యేక బస్సు సేవలు భక్తులకు అందుబాటులో ఉంటాయని, ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఇవి కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. మేడారంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 28 ఎకరాల విస్తీర్ణంలో భారీ బస్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే క్యూలైన్లు, భక్తులు వేచి ఉండే గదుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత విషయంలో రాజీ పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కోట్లాది మంది ప్రజల నమ్మకానికి ప్రతీక అయిన మేడారం జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని మంత్రులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## విజయవంతంగా సుంకిరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం సేవలు




**అమనగల్లు, మహా:** మాడుగుల మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరం సేవలు విజయవంతంగా ప్రారంభమయ్యాయి..ఈ ముఖ్య అతిథులుగా అభ్యుదయ భారత్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ సూదిని మనోహర్ రెడ్డి,ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు..తొమ్మిది రోజుల పాటు మాడుగుల పట్టణ కేంద్రంలో నిర్విరామంగా కొనసాగనున్న ఉచిత కంటి వైద్య శిభిరం సేవలను ఉద్దేశించి మాట్లాడారు.నిరుపేదలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించడం అత్యంత అభినందనీయమని, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు.,ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఖరీదైన వైద్యానికి దూరంగా ఉన్నవారికి ఎంతో ఉపయోగపడుతుందని, కంటి పరీక్షలతో పాటు, కంటి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నారని, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా అందజేస్తున్నారని చెప్పారు.వెల్దండ,ఆమనగల్,కల్వకుర్తి మండలాలలో విజయవంతంగా ఉచిత కంటి వైద్య శిభిరాలు నిర్వహించి ఎంతోమంది నిరుపేదలకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విజయవంతంగా కంటి చూపును అందించారని, మాడుగుల మండలంలో నాల్గవ క్యాంప్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.ప్రముఖ వైద్య నిపుణులు శంకర నేత్రాలయ చెన్నై వారిని మన ప్రాంతానికి తీసుకొచ్చి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్న సుంకిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు,మొదటి రోజు శిబిరాన్ని దాదాపు 300 మందికి పైగా సందర్శించగా,200మందివరకు విజయవంతగా కంటి పరీక్షలు నిర్వహించామని పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కంటి పరీక్షలు నిర్వహించారు. నిరుపేదలు,వృద్ధులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల గ్రామ నూతన సర్పంచ్ ముధేంటి రజిత దేవయ్య గౌడ్, మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్య గౌడ్ ఐక్యత ఫౌండేషన్ మండల ఇంచార్జ్ జైపాల్ రెడ్డి,సభ్యులు నాగిళ్ళ శివ, ఎరుకలి శివ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ని కలిసిన సర్పంచ్ బాలస్వామి



**వలిగొండ, మహా :** వలిగొండ మండలములోని రెడ్లరేపాక గ్రామ నూతన సర్పంచ్ బాలస్వామి యాదవ్ ఆదివారం భువనగిరి శాసనసభ్యులు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు అలాగే నేడు జరగబోయే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బీమా నాయక్ వలిగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి మాజీ సర్పంచ్ మాదా లావణ్య శంకర్ గౌడ్ మండల నాయకులు ఎండీ జాన్ పాషా పంతంగి శ్రీనివాస్ రవిశంకర్ గౌడ్ పాల్గొన్నారు



## జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన భువనగిరి సాయినాథ్

**వలిగొండ, మహా:** జాతీయస్థాయి కరాటే పోటీలలో వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన భువనగిరి సాయినాథ్ ఆదివారం హైదరాబాదులోని చందానగర్ స్టాండర్డ్ షిటీరియో కరాటే ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించినట్లు సీనియర్ కరాటే మాస్టర్ భువనగిరి ముత్యాలు ఆదివారం విలేకరులకు తెలిపారు. సాయినాథ్ నీ ఇండియా గ్రాండ్ మాస్టర్ పీ బాలరాజు అభినందించారు.

## రాష్ట్ర బూత్ లెవెల్ అధికారులతో కేంద్ర ఎన్నికల కమిషనర్ సమావేశం

**కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ కు ఘన స్వాగతం...**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఆదివారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నిర్వహించిన, తెలంగాణ రాష్ట్ర బూత్ లెవెల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ కు ఘన స్వాగతం... హైదరాబాద్ పర్యటనలో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని రామోజీ ఫిలిం సిటీకి చేరుకున్న కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గారికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్, జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రా రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, ఇతర అధికారులు కలిసి ఘన స్వాగతం పలికారు.

## ఫామ్‌హౌజ్‌లో చలి ఎక్కువై కేసీఆర్ బయటకొచ్చారు

**కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ విమర్శలు**



**మహా:** ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో చలి ఎక్కువైందని.. అందుకే కేసీఆర్ బయటకు వచ్చారని కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ విమర్శించారు. తాము ప్రతిపక్షం ఉండొద్దని ఏనాడూ కోరుకోలేదని.. కేసీఆర్ అసెంబ్లీకి రావాలనే కోరుకున్నామని అన్నారు. కానీ.. కేసీఆరే ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారని తెలిపారు. తెలంగాణ నేల.. కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి చాలా ఇచ్చిందని అన్నారు. కేసీఆర్ కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదని ఎద్దేవా చేశారు.

## బిగ్‌బాస్ సీజన్9 విజేత కల్యాణ్ పడాల

**మహా:** బిగ్‌బాస్ సీజన్9 విజేతగా కల్యాణ్ పడాల నిలిచారు. చివరి వరకూ ఉత్కంఠగా సాగిన ఈ సీజన్‌లో ప్రేక్షకుల నుంచి అత్యధిక ఓట్లు సాధించిన కల్యాణ్ విజేతగా నిలిచినట్లు వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు. బిగ్‌బాస్ ఇచ్చిన రూ. 20లక్షల గోల్డెన్ బ్రీఫ్ కేసును కూడా వద్దనుకుని చివరి వరకూ విజయంపై నమ్మకంతో నిలబడ్డాడు. ఆ నమ్మకమే పవన్‌ను విజేతని చేయడమే కాదు.. రూ.35లక్షల ప్రైజ్ మనీతో పాటు, ట్రోఫీని అందుకునేలా చేసింది. ఈసారి బిగ్‌బాస్‌కు ముందు నిర్వాహకులు పెట్టిన అగ్ని పరీక్షలో ఒక కామన్‌మ్యాన్‌గా కల్యాణ్ పడాల పోటీ పడ్డారు. అక్కడ కూడా ప్రేక్షకుల మనసులు గెలుచుకొని హౌస్‌లోకి అడుగు పెట్టాడు.

## గుట్టలో ఘనంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**యాదగిరిగుట్ట, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆదివారం మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ... వైఎస్ఆర్సిపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రముఖ సినీనటి శ్యామల హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తిరిగి ఆంధ్రప్రదేశ్లో వైఎస్ఆర్సిపి అధికారంలోకి రావడం ఖాయమని వైయస్ జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు... యాదగిరిగుట్టలో ఇంత పెద్ద ఎత్తున వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాలలో జగన్ జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అన్నారు జగన్ ఏపీ సీఎం గా ఉన్నప్పుడు ఏపీలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని అన్నారు తిరిగి ఆయన సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని ఆమె అన్నారు ఈ సందర్భంగా పేదలకు ఉచితంగా పెద్ద ఎత్తున చీరలను దుప్పట్లను పంపిణీ చేశారు విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు పెన్సిళ్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి నాయకులతో పాటు స్థానిక నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## పేదల గుండెల్లో గాంధీ పేరు చెరపలేరు

**బీర్ల అయిలయ్య ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే**

**భువనగిరి, మహా:** పథకంలో గాంధీజీ పేరును తొలగిస్తారేగాని భారత దేశ పేదప్రజల గుండెల్లో మహాత్మా గాంధీ ఎప్పుడు ఉంటారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని గాంధీ కుటుంబం పై క్షక్ష సాదిచటంకోసం మోదీ ,అమిత్ షా చూస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మండిపడ్డారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని గాంధీ పార్క్ వద్ద డీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన గాంధీ చిత్ర పటాలను చేత పట్టుకొని నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు జీవోనాపాధికై 2005 లో ఆనాటి యూపీఏ ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని తెచ్చిందన్నారు. మోదీ హయాంలో ఎన్డీయే ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశానికి తూట్లు పొడుస్తూ పేద ప్రజల పొట్ట కొట్టేలా విబిజి రాంజీ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఔర్ అజ్వీక మిషన్ పథకాన్ని తెచ్చిందన్నారు. గతంలో ఉపాధి హామీ నిధులు 100% కేంద్రమే భరించేది, ఇప్పుడు 60% కేంద్రం 40% రాష్ట్రలు భరించాలని కేంద్రం అటుందన్నారు.మన రాష్ట్రంపై ఏటా 1000 కోట్లు భారం పడుతుందన్నారు. పథకాల్లో గాంధీ జీ పేరును తొలగిస్తారేగాని భారత దేశ పేదప్రజల గుండెల్లో గాంధీజీ ఎప్పుడు ఉంటారని అన్నారు.కేంద్ర ప్రభుత్వ సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని గాంధీ కుటుంబం పై క్షక్ష సాదిచటంకోసం మోదీ అమిత్ సహా చూస్తున్నారని బీర్ల అయిలయ్య అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్ పర్సన్ డ్రు శోభారాణి,రాష్ట్ర నాయకులు జనగామ ఉపేందర్ రెడ్డి, తంగల్లపల్లి రవి కుమార్, పోత్నాక్ ప్రమోద్ కుమార్, పొతంశెట్టి వెంకటేశ్వర్లు ,బట్టు రాంచెంద్రయ్య,శంకర్ నాయక్,సత్యనారాయణ, వెంకటేశ్వర రాజు ,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు న్యాయవాదుల చలో సచివాలయం పాదయాత్ర

**ఆమనగల్లు, మహా:** న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం చేపడుతున్న చట్టం అమలు కోసం చేపడుతున్న సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధానంగా న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించి అమలు చేయాలని, 41 ఏ పీఆర్ పీసీ చట్టం సవరించాలని, న్యాయవాదులకు ఆరోగ్య భీమాను రూ.10 లక్షలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు ₹10,000 స్టైఫండ్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈనెల 24 న సచివాలయం ముట్టడి ఉంటుందని ఆయన గుర్తు చేశారు. అందుకోసం సోమవారం ఉదయం ఆమనగల్లు పట్టణం నుంచి చేపడుతున్న పాదయాత్రలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాజీతోనే రాజా మార్గం...

**జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప**





**ఆమనగల్లు, మహా:** రాజీ తోనే రాజా మార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు వివిధ కేసుల్లో కక్షిదారులు రాజీ పడితేనే ఇరువురికి న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు ఆమనగల్లు జూనియర్ మున్సిఫ్ కోర్ట్ లో ఆదివారం జడ్జ్ స్వరూప ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు సుమారు 136కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జ్ కాటం స్వరూప మాట్లాడుతూ వివిధ కేసులలో కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. లోక్ అదాలత్లను కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండే కార్ యాదిలాల్, ప్రధాన కార్యదర్శి దుద్దు ఆంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ ఇరుముడి

**ఆమనగల్లు, మహా:** హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహాపడి పూజ, ఇరుముడి కార్యక్రమం కడ్తాల్ మండలం కర్కల్ పహాడ్ గ్రామంలో వైభవంగా జరిపారు. స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం రవీందర్ రెడ్డి, నర్సింగ్, నల్ల వోతుల జయ రాములు, హరి, నాగరాజు, పట్నం శివరాజు గురుస్వాముల సమక్షంలో మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప మాలదారులు అయనను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. భక్తిభావం అలవర్చుకున్నప్పుడే శాంతియుత సమాజం నెలకొంటుందన్నారు.

## మంత్రులను కలిసిన ఎక్వాయిపల్లి నూతన సర్పంచ్



**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి నూతన గ్రామ సర్పంచ్ పాలకూర్ల కరుణాకర్ గౌడ్ ఆదివారం వివిధ శాఖల మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి,టీపీసీసీ ప్రచార కమిటీ చేర్మెన్ మధుయాష్కి గౌడ్ లను మర్యాద పువకంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కి సహకరించాలని కోరినట్లు గ్రామ సర్పంచ్ పాలకూర్ల కరుణాకర్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ గౌడ్,వార్డు సభ్యులు దీపక్ కుమార్, మహేష్, లు ఉన్నారు.



# కనిపించని గాయాలు!

అది వాత్సల్యమో వ్యామోహమో
ఇదమిద్ధంగా చెప్పలేను
కనిపించని గాయాలకు
ఇదీ కారణమని చూపలేను!

రక్తం కారుతుంటే కదా
ఎవరైనా చికిత్స చేసి
గాయానికి కట్టు కట్టేది
ఇచ్చోటనే అని చూపించలేను!

నడిచినంత కాలం
పాదం మొదలుకొని
శరీరమంతా తండ్లాట గాయాలే
బాధ అవ్యక్త అనుభూతే!

ఈ బంధాలు
ఎవడు ముడి వేశాడో కానీ
ప్రాణం ఉన్నంతవరకు
ఎవరూ తెంచుకోలేరు!

పూలు కోసుకున్న వాళ్ళు
కాయలేరుకున్న వాళ్లు
ఫలాలు అనుభవించిన వాళ్లు
తడారిన చెట్టుకిన్ని నీళ్లు పోయరు!

కాలం ఋతువులను నెమరేస్తూ
నిరంతరం పయనిస్తుంటుంది
సుఖ దుఃఖాలు కలిసిపోయినందన
ఏదెంతో బేరీజ్ వేసుకోలేకపోతున్నాం!

పుట్టుకతో
యుద్ధం మొదలుపెట్టిన వాళ్ళం
విజయమో వీర స్వర్గమో
కోరుకోవడంలో తప్పేం లేదు కదా!!

**- కోట్ల వేంకటేశ్వరరెడ్డి, 9440233261**

# క్షతగాత్రుడు

వయస్సుతో సంబంధం లేదు
రోజు ఎగిలివారంగ
రెండు మూడు ఘడియలు
కవి రచయిత లు
కవితా ప్రసవ వేదన అనుభవిస్తుంటారు
పురిటి నొప్పులతోనే
రోజు వెలుతురును కంటుంటారు

ఒక్కొక్కరి ఆవేదన
ఆవేశ నివేదనా వర్ణనాతీతం
అక్షరాలను ఏర్చి కూర్చి
పదాలను చెక్కి
భావావేశ వాక్యాలను
కనిపెంచిన వాళ్లకు తెలుస్తుంది
మాతృత్వంలోని తీయ్యదనం

కుల మత వర్గ లింగ భేదం లేకుండా
ఎవరిదో ఒకరి
కవితా బిడ్డను
హత్తుకొని ఎత్తుకొని చదవకున్నా...
కవిత రాయకున్నా...
ఆ రోజు
మనస్సు మనసున ఉండదు

నువ్వు
ఎప్పుడైనా వెళ్లి చూడు
మాట్లాడించి చూడు మిత్రమా !
కవి రచయితల ఇల్లంతా
పుస్తకాల పురిటి వాసన

కవిని గన్న ఇల్లు
కవన కదన భూమి
కవి రచయిత
కనిపించని బాధల నిత్య క్షతగాత్రుడు

**- జిందం అశోక్,**

# సహస్ర చంద్ర దర్శనం

ప్రముఖ నటుడు,ప్రయోక్త,కవి, విమర్శకుడు శ్రీ తాటికొండాల నరసింహారావు గారి సహస్ర చంద్ర దర్శనం సందర్భంగా ఆయన సాహిత్య,సామాజిక, నాటక జీవితం పైన ఒక అభినందన సంచిక తీసుకుని రావాలని ఆయన మిత్రులు, అభిమానులు సంకల్పించారు. కనుక ఆయన సహచరులు ఆయనతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ అభినందన సంచికకు రచనలు పంపవలసినదిగా ఆహ్వానిస్తున్నాము. రచనలను 9866334415 లేదా 9573427422 నెంబర్లకు వాట్సాప్ కానీ neelimavsrao@ gmail.com , vamsykrishna8@ gmail.com,sreedhathri4920@ gmail.com కి మెయిల్ చేయగలరు.

**- టి. అరుణ**

**ప్లాట్ నెంబర్ 27, రోడ్ నెంబర్ 4, లక్ష్మీనగర్ కాలనీ , బడంగ్ పేట్, హైదరాబాద్ -500058 చిరునామాకు పంపించగలరు. మీ రచనలు చేరడానికి చివరి తేదీ 31-01-2026**

**ఇట్లు/-**
**తాటికొండాల నరసింహారావు గారి మిత్రులు,అభిమానులు**

# రచనలకు ఆహ్వానం

**సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..**

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
**mahaapatrika@gmail.com**
**whatsapp 9247580946**

# పుస్తక సమీక్షల కోసం...

**తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.**
**43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.**

## ఉర్దూ సాహిత్యంలో రాజస్థాన్ షాన్ నిషాన్

# కవి షీన్ కాఫ్ నిజామ్

'దేశ భాషలందు తెలుగు లెస్స'అని శ్రీకృష్ణదేవరాయలు అభివర్ణిస్తే భారతీయ భాషలలో ఉర్దూ "కోహినూర్"గా ప్రముఖ సాహిత్య దిగ్గజం కుష్వంత్ సింగ్ కొనియాడారు.ఉర్దూసాహిత్యం ఒక అద్భుతమైన ప్రక్రియ. అందులోనూ కవిత్వంలోని గజల్, రుబాయి, శారియా,నజ్మ్ వంటి వివిధ రీతులు మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగించే జర్నీ. ఇది పర్షియన్ లిపిలో రాయబడినా స్వదేశీ సాహిత్యమే భాషా చరిత్రకారులు.దీని పరిమళం ఢిల్లీ కేంద్రంగా భారతదేశంలోనే మొగల్ సామ్రాజ్య కాలంనుండి వెల్లివిరిసింది. అందుకే ఇది భారతీయ భాషలలో ఒకటిగా జీవిస్తుంది.ఇది ఉత్తర భారతదేశంలో,దక్కన్ పీఠభూమిలో బహుళంగా తూర్పు పశ్చిమ ప్రాంతాల్లోనూ పరివ్యాపితమైంది. మీర్,గాలిబ్,గుల్జార్,షీన్ కాఫ్ నిజామ్ వంటి ఎందరో గొప్పగొప్ప కవులు ఉర్దూ గజల్ కవిత్వంలో సుప్రసిద్ధులు.



షీన్ కాఫ్ నిజమ్ గా పిలువబడే ఉర్దూ కవి,పండితుడు శివ కిషన్ బిస్సా నవంబర్ 26,1945లో రాజస్థాన్ లోని జోద్ పూర్ లో జన్మించిన గొప్ప ఉర్దూ కవి, విమర్శకుడు.ఆయన రచనలలో ఎన్నదగిన కవితా సంకలనం గుమ్షుదా దైర్ కి గుంజ్తీగుంటియాన్ ఉర్దూలో సాహిత్య అకాడమీ అవార్డ్ 2010లో అందుకున్నది. గజల్ అనేది ఉర్దూ, పర్షియన్ కవితా ప్రక్రియ, ఇది సాధారణంగా ప్రేమ, భక్తి వంటి భావోద్వేగాలను అందమైన, సున్నితమైన భాషలో వివరిస్తుంది.నాజ్మ్ అనేది ఉర్దూ మరియు సింధీ కవిత్వంలోని ఒక రూపం. ఇది గజల్ కంటే భిన్నంగా ఉంటుంది,మరి కవితా నియమాలకు అనుగుణంగా నిర్మాణాత్మకంగా అభివృద్ధి చేయబడుతుంది. ఈ పదం కవితలు లేదా పద్యాలను సూచించడానికి కూడా ఉపయోగించబడుతుంది. కైఫీ అజ్మీ వంటి కవులు నాజ్మ్‌లు రాశారు.షీన్ కాఫ్ నిజమ్ 35 గజళ్ళు,11నజ్మాలు,32 షాయరీయా,40 ఈ బుక్స్,4 దోహాలు.

షీన్ కాఫ్ నిజాం జన్మనామం శివ్ కిషన్ బిస్సా పద్మశ్రీ పురస్కాన్ని 2025లో అందుకున్నారు. ఆయన మే 2025లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. అక్కడ భారతీయ సాహిత్యం,ఉర్దూ కవిత్వానికి ఆయన చేసిన కృషికి ప్రధానమంత్రి ఆయనను అభినందించారు. సెప్టెంబర్ 2025లో, పాట్నాలో జరిగిన ఆసియాలో అతిపెద్ద సాహిత్య ఉత్సవం "UNMESHA"లో మూడవ ఎడిషన్‌లో S.K. ఒక విశిష్ట వ్యక్తిగా నిలిచారు.అతని కలం పేరు ఉర్దూలో S K అది అతని పేరుకు అనుసరణ, 'షీన్' అంటే 'S' మరియు 'కాఫ్' అంటే 'K'.ఎస్. కే.నిజాం సాహిత్య జీవితంలో అనేక కవితా సంకలనాలను ప్రచురించారు. అతని గ్రంథాలలో లాంగ్ మూమెంట్స్ ఆఫ్ సలీబ్,రివర్ ఇన్ ది ఎడారి, శబ్దాలు,ది షాడో వాజ్ నాట్ లాంగ్,ది బయాజిన్ హాజ్ బీన్ లాస్ట్,'షాడోస్'లో ఈ మార్గం ఎక్కడికీ దారితీయదు.మార్గాలకు ఇతర పేర్లు కూడా ఉన్నాయి. నిజాం కవితా సంకలనం, 'గుమ్షుదా డేయర్స్ గర్జనలు', నిజాం తోటి రాజస్థానీ ఉర్దూ కవి మఖ్మూర్ సయీదీ జీవితం, రచనల మూల్యాంకనాన్ని 'భీడ్ మే అకేలా' పేరుతో రాజస్థాన్ ఉర్దూ అకాడమీ 2007లో ప్రచురించింది.

ప్రఖ్యాత పరిశోధనా పండితుడు "అల్లామా కాలిదాస్ గుప్తా రిజా"పై "గాలిబియత్ లేదా గుప్తా రిజా" అనే పుస్తకాన్ని ఆయన సవరించారు. ఆయన నాగరిలో తన కవితల ఎంపికతో మోర్డెన్ ఉర్దూ కవి 'మీరా జి'ని కూడా సవరించి పరిచయం చేశారు. ప్రముఖ పాకిస్తానీ ఉర్దూ కవి 'మునీర్ నియాజీ' యొక్క ఎంపికను కూడా ఆయన నాగ్రిలో ప్రచురించారు.ఇంకా కవి షీన్ కాఫ్ నిజామ్ గొప్ప విమర్శకుడు కూడా.ఆయన విమర్శ గ్రంథాలలో ముఖ్యంగా 'నవ్వు మరి నవ్వు', 'నాకు ప్రేమను ఇవ్వండి', 'తజ్కిరా మస్సిర్ షోరా ఇ జోద్ పూర్' వంటివి ఉన్నాయి.ఉర్దూ సాహిత్యంలో విస్తృతంగా రచనలు చేసిన రాజస్థాన్ కవి శివ కిషన్ బిస్సా లేదా షీన్ కాఫ్ నిజాం అందుకున్న అవార్డులలో,19992000 కాలంలో రాజస్థాన్ ఉర్దూ అకాడమీ, జైపూర్ ద్వారా మహమూద్ షిరానీ అవార్డు, 2001లో భాషా భారతి అవార్డు, మేసోర్, 2006లో బేగం అక్తర్ గజల్ అవార్డు, ఢిల్లీ,2006 2007 మధ్య కాలంలో రాష్ట్రీయ ఇక్బాల్ అవార్డు, 2010లోకేంద్రసాహిత్య అకాడమీ అవార్డ్,2015లో జేఎన్‌వీయూ గౌరవ్ రత్న పురస్కారం,2016లో ఆచార్య విద్యానివాస్ మిశ్రా స్మృతి అవార్డు, బనారస్,2018లో సంకృతి సౌరభ్ అవార్డు, కోల్‌కతా ,2021లో గంగాధర్ 2022లో జాతీయ అవార్డు, రాజస్థాన్ రత్న అవార్డు,2025లో ప్రతిష్టాత్మక పద్మ శ్రీ అవార్డ్ ను అందుకున్నారు.

**ఇక కవి షీన్ కాఫ్ నిజాం కవిత్వం..**
**గజల్1**
**"నాలో అంతం లేకపోతే"**

నాలో అంతం అనేదే లేకపోతే,/ నాలో నాదేదీ ఎందుకు లేదు?
ఏ ఆకు తెర కాదు?/ఈ వర్షం నాలో ఎందుకు కురువడం లేదు?
మరి ఇప్పుడు ఇక్కడ తెర ఎందుకు లేదు?/ ఇది అడవి అయితే, రాళ్ళ గుట్ట ఎందుకు లేదు?
వర్షం కోసం చేసే ప్రార్థన ఎక్కడికి పోతుంది?/ చెట్టుపై ఒక్క ఆకు కూడా కానరాదు.
తలుపు దగ్గర అందరూ సురక్షితంగా ఉన్నారు./పక్షి లాంటిది ఎందుకు లేదు?
ప్రతి ముంతలో పువ్వులు వికసిస్తున్నాయి కానీ,/ ముఖమంత తాజా తాజాగా లేదు.
ప్రజలకు అర్థం కావాలనుకుంటే, దేవతలను అడిగి తెలుసుకో/ఇంకా మన నగరం ఏమేమి చూడలేదు ?కొన్ని షేర్

**ఓ-షాయరి అనువాదంతో...**

1.ఈ పిల్లవాడు ప్రపంచంలో ఎలా ఉన్నాడు? నన్ను చూడు.
2.ఎవరో మిమ్మల్ని వెనుక నుండి గమనిస్తూ ఉంటారు.
వీధి తలుపు నుండి ఇంటికి 'నిజామ్' ఎందుకు గుడ్డిగా చూస్తున్నాడు?
3.దృశ్యాన్ని ఎలా మార్చవచ్చు? రాత్రి గడిచిపోవాలని ప్రార్థన చేయండి.

**అలాగే రెండు దోహాలు...**

1.ఈ విదేశీ దేశంలో నా గురించి ప్రతి ఒక్క విషయం నాకు గుర్తుంది.
2.ఇల్లు అంటే పగలు, నా ప్రేమ, ఇల్లు అంటే రాత్రి.
3.కబీర్, మనం కాలం చేతుల్లో నిలబడి ఉన్నాము.

**నజ్మా పద్యం ఇలా...**

1 ఎడమ తప్పిపోయింది/ఎడమ/నీడలలో/వేచి ఉంది/
2.పాత ఆలయంలో సాయంత్రం/ఇప్పుడు అక్కడ/సంప్రదించు/చాలా పాతది/సూచన

'షీన్','కాఫ్' అనే రెండు ప్రధాన అంశాలను కలిగిన 'ఇష్క్' (ప్రేమ) అనే పదం యొక్క భాగాలే గాక ఒక ప్రఖ్యాత ఉర్దూ కవి కలం పేరు కూడా. ఇష్క్ లో అవి ప్రేమ దశలను సూచిస్తాయి, షాక్ (సందేహం) కోసం షీన్, ఖుర్బానీ (త్యాగం) కోసం ఖాఫ్ నిలిచి ఉండడం వాటి ప్రత్యేక స్థానం.ప్రేమ దశలయిన (ఇష్క్)లోని షీన్ లోని షాక్ లేదా సందేహం, ప్రేమికుడు తన భావాల ప్రామాణికతను ప్రశ్నించే దశయితే, ఖాఫ్ ఖుర్బానీ అదే త్యాగంలో ప్రేమికుడు తన ప్రియుడి కోసం ప్రతిదీ వదులుకోవడానికి సిద్ధంగా ఉండే అంతిమ దశను సూచిస్తుంది.ఆ కలం పేరులోని నిగూఢ ప్రేమ కవిత్వమే ప్రపంచంగా భారతీయ పాఠకునేకాదు గ్లోబల్ రీడర్స్ నూ గాఢంగా ఆకట్టుకోవడం,చరిత్రలో గొప్పగా నిలువడం కవి ప్రతిభను,భావోద్వేగాల శైలి లయలతో పాటు ఆలోచన ఇతివృత్తాలకూ చేసిన అక్షరాభిషేకమే.

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు,**
**98493 05871**

## పల్లె మట్టినుంచి పుట్టిన కథల సువాసన...

# బందారం: నందిని సిధారెడ్డి కథలు


జీవితం అనేది ఎప్పుడూ ముందుకు నడిచే ప్రయాణం... ఆ ప్రయాణాల్లో మన హృదయానికే తెలిసిన కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా జ్ఞాపకాలయ్యి మనసులో నిలిచిపోతాయి. ఆ జ్ఞాపకాలు అక్షరాల రూపంలో పరిమళిస్తే అవే కవితలుగా, కథలుగా మారుతాయి. ఊహలతో రాసిన కథ ఒక కాలం వరకే నిలుస్తుంది. కానీ నిజజీవితపు అనుభవాలతో రాసిన కథలు కాలాన్ని దాటి నిలిచే శాశ్వతతను సంపాదిస్తాయి. అవే ఎంతమందికో మార్గదర్శకాలు అవుతాయి... స్ఫూర్తిని నింపుతాయి...మనసులో నిండిన తడిని మరోసారి తడుముతాయి. అటువంటి ప్రాణం ఉన్న కథలే బందారం కథలు.

ఈ పుస్తకంలోని 24 కథలు మన ఊళ్ల మనుషులనూ, వారి పలకరింపులనూ, శ్రమనూ, ప్రేమనూ, ప్రకృతితో కలిసిన వారి జీవన సరసననూ చెప్పుకునే జీవచిత్రాలు. మనసులో నిద్రించిన అనుభూతులను మేల్కొలిపి, ఎన్నాళ్లకెన్నాళ్లూ హృదయంలో నిలిచిపోయే బందారు కథలు ఇవి.


కథల్లో వృత్తి కళాకారుల జీవితం, వారి వ్యక్తిత్వంలోని పోరాటాలు, స్త్రీ పాత్రల భావజీవితం, గ్రామీణ సమాజంలోని వర్గ, లింగ పాత్రలు స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. ఊరిలోని నమ్మకాలు, ఆచారాలు, ముఖాముఖిగా మాట్లాడే మనుషుల నిజజీవిత దృశ్యాలు సహజత్వంతో చిత్రించబడ్డాయి. గ్రామం అనే జీవ వాతావరణాన్ని దాని అసలైన రంగుల్లో చూపించడమే ఈ రచనలోని బలం. ఈ కథలలోకి మనం వెళ్లి చదివినట్లయితే... 'ఋణానుబందాలు' కథ చదువుతుంటే ఒక విధమైన భావోద్వేగానికి గురైయ్యే సంఘటనలు కనబడతాయి. ఆ ఊరిలో ఉండే షావుకారి తాను పెంచి పోషించిన ఆవు చనిపోయినప్పుడు అతనిలో ఏర్పడే మానసిక సంఘర్షణని ఈ కథలో చాలా బాగా చూపించారు. మనుషులకే కాదు పెంచిన ఆవును కూడా దహన సంస్కారం చేయడం అనేది వాటి పైన ఉన్న ఎనలేని ప్రేమను మనకు తెలియజేసే పాత్ర.

'తడిసి మోపెడు' ఈ కథ గ్రామీణ జీవన సౌందర్యాన్ని సహజమైన వర్ణనతో జీవవంతం చేస్తుంది, ఎన్నాళ్లకో వర్షం కురిసి చెరువు నిండిన ఆనందంలో ఊరంతా కలిసి చేరడం, సుధాకర్ రెడ్డి, మల్లయ్యల మధ్య జరిగే సరదా పందెం, చివరికి ఊరు మొత్తం ఒకటిగా కలిసి సంబరాలు చేసుకోవడం ఈ సంఘటనలు ఊరి మనసును, మనుషుల మధ్య ఉన్న అనుబంధాన్ని హృదయానికి హత్తుకునేలా చూపిస్తాయి. చివర్లో "నీలొచ్చిన, కన్నీళ్లువచ్చినా... ఊరును పట్టతరం కాదు" వంటి భావోద్వేగ పంక్తులు కథకు మరింత లోతు తెచ్చి, ఏ కష్టం వచ్చినా ఊరు ఒక్కటిగా నిలబడే మనసు ఎంత బలమో తెలియజేస్తాయి. అవన్నీ కలిసి ఈ కథ ఆప్యాయత, నిజాయితీ, పల్లె వాతావరణపు మాధుర్యాన్ని తనలో ఒదిగించుకుని, పాఠకుడి హృదయాన్ని తడిమే మనసును హత్తుకునే రచనగా నిలుస్తుంది

'ఒక చీకటి రాత్రి' ఈ కథ గ్రామీణ జీవనంలోని భయం, ధైర్యం మధ్య జరిగే నాజూకు సమతౌల్యాన్ని అద్భుతంగా చూపిస్తుంది. చీకటి రాత్రిలో షావుకారి ఇంట్లో దొంగలు పడటంతో మొదలై, షావుకారి భార్య చాకచక్యం, జీతగాళ్ల అరవడం, ఊరివాళ్లు ఒక్కటై దొంగలను తరుమడం వంటి సంఘటనలు గ్రామ ప్రజల ఏకత్వాన్ని, సంక్షోభ సమయాల్లో వారి చురుకుదనాన్ని స్పష్టంగా వెల్లడిస్తాయి. దొరికిన దొంగను పోలీసులకు అప్పగించినా, "ఇంకోసారి పగబట్టితే?" అనే అనుమానం గ్రామ వాస్తవ జీవితంలోని భయాన్ని సహజంగా ప్రతిబింబిస్తుంది. మొత్తంగా, ఈ కథ ధైర్యంతో పాటు అనుభవంతో పెరిగే జాగ్రత్తను, ఊరి జనాల కట్టుబాటు, అవసరమైతే తిరుగులేని ధైర్యం, ఎలా కలసిపోతాయో హృదయానికి హత్తుకునేలా చెబుతుంది.



'బాకీ' కథలో 'స్కైలాబ్' భూమిపై పడిపోతుందనే పుకారు గ్రామంలో ఎలా భయం, అయోమయం కలిగించిందో ఎంతో సహజంగా చూపించబడింది. "ఇక బ్రతకము" అనే భావనతో వాళ్ల దగ్గర ఉన్న దాచిపెట్టిన ఆస్తులను కూడా అమ్ముకొని కుటుంబంతో కలిసి విందులు చేస్తూ చివరి క్షణాలను సంతోషంగా గడపాలని నిర్ణయించుకోవడం గ్రామ ప్రజల అమాయకత్వాన్ని, భయం ఎదిరించినప్పుడు కలిగే అప్రత్యక్ష ధైర్యాన్ని మరియు జీవితం పట్ల ఉన్న ఆతురతను బలంగా ప్రతిబింబిస్తుంది. కానీ స్కైలాబ్ శకలాలు సముద్రంలో పడ్డాయని, ప్రమాదం లేనని రేడియోలో వచ్చాక మళ్లీ పాత జీవితానికి చేరే వాళ్ల స్థితి హాస్యాస్పదంగా, అలాగే హృద్యంగా అనిపిస్తూ మనుషుల స్వభావంలోని ఆశ, భయం, అమాయకపు ఆలోచనలను అద్దం పట్టినట్టుగా కథలో కనిపిస్తుంది.




'చినుకు చినుకుల వాన' కథలో "మనుషులు ధర్మం తప్పినట్టే ఋతువులు కూడా ధర్మం తప్పాయి" అనే ప్రారంభ వాక్యంతోనే రచయిత సామాజిక, ప్రకృతి అసమతుల్యతకు సంకేతం ఇస్తాడు. వర్షం లేక కరువు బారిన పడిన ఊరు, వాన కోసం పూజలు, బోనాలు, కప్పతల్లి లగ్గం వంటి ఆచారాల ద్వారా గ్రామంలోని ప్రజలు ఎంత తాపత్రయపడుతున్నారో కథ ఆసక్తికరంగా కొనసాగుతుంది. అయితే వర్షాభావం అనే ప్రధాన అంశం భావపరంగా బలమైనదైనా, కథ నిర్మాణం సంఘటనలను కేవలం సమాచారంలా వరుసగా చెప్పినట్టుగా ఉండటంతో ఇది ఒక శక్తివంతమైన కథగా మలచబడలేదు. వ్యక్తిగత పాత్రల ద్వారా భావోద్వేగ సంఘర్షణను చూపించకుండా, సమూహ ఘటనల వర్ణనకే పరిమితమవడం కథ ప్రభావాన్ని చూపెట్టలేకపోయింది. సరైన పాత్ర కేంద్రీకరణ, సంఘర్షణ, క్లైమాక్స్ ఉంటే ఈ కథ మరింత ప్రభావవంతమైన సామాజిక కథగా నిలిచేదనే అభిప్రాయం పాఠకుడిలో ఏర్పడుతుంది.

'యశోద' కథ గ్రామీణ మహిళ జీవితంలోని అణచివేతలు, భయాలు, శరీర, మనసుల మీద జరిగే హింస, ఆ తరువాత కలిగే లోపలి తిరుగుబాటును గట్టిగా ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా ఆసుపత్రి, అత్తింటి, రాత్రి సంఘటనల వర్ణనల్లో రచయిత ఉత్కంఠను, భావోద్వేగ తీవ్రతను సహజంగా నిర్మించాడు. యశోద పాత్ర కేవలం బాధితురాలిగా కాకుండా, తన అవమానానికి ఎదురు నిలిచే ధైర్యమైన వ్యక్తిత్వంగా ఎదగడం కథకు బలం. మొదటి భాగంలో విషాదం అధికంగా ఉండగా, చివరి భాగంలో మార్పు, ఆశ, మానసిక వికాసం స్పష్టంగా కనిపిస్తాయి. కొద్దిచోట్ల సంఘటనల మార్పు వేగంగా జరిగినా, మొత్తం కథ మహిళ జీవన వాస్తవాన్ని నిజాయితీగా, ప్రభావవంతంగా ఆవిష్కరిస్తుంది.

'బందారం కథలు' పల్లె జీవన వాస్తవాన్ని సహజంగా, హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించిన విలువైన కథా సంపుటి. గ్రామీణ జీవితంలోని ఆనందాలు, బాధలు, సంఘర్షణలు, మానవ సంబంధాల లోతులు ఈ కథల్లో స్పష్టంగా కనిపిస్తాయి. ఊహల కథలకంటే అనుభవాల కథలకు ఉన్న బలాన్ని ఈ పుస్తకం మరోసారి నిరూపిస్తుంది. పల్లె జీవనాన్ని, సామాజిక సాహిత్యాన్ని చక్కగా ఆస్వాదించాలనుకునే ప్రతి పాఠకుడికీ ఇది తప్పక చదవాల్సిన సంకలనం.

చక్కటి కథ సంకలనాన్ని తీసుకువచ్చిన నందిని సిధారెడ్డి సార్ ని హృదయపూర్వకంగా అభినందిస్తూ, వారి నుంచి మరెన్నో గొప్ప సాహిత్య సంకలనాలు వెలువడాలని ఆశిస్తూ

ఈ కథా సంపుటి నవోదయ బుక్ హౌస్, నవ తెలంగాణ బుక్ హౌస్ లలో లభిస్తుంది.
వెల: ₹200

**- గాజోజి శ్రీనివాస్,**
**99484 83560**

# అరుదైన అభినందన



నాన్న ఆఫీసుకు
వెళుతున్న తొందరలో చూళ్లేదు.
అమ్మా చూడలేదు
బొమ్మలు తిండిపెడతాయా?
అంటూ...
నాల్గు వడ్డించిందే తప్ప.
అందుకోసమే చూస్తున్న అన్నా
వెక్కిరింపుగా నవ్వాడు.

దుఃఖాన్ని బిగపట్టుకున్నా,
కాగితాన్ని
విసిరికొట్టింది చిట్టి
కిటికిలోంచి.
మరుక్షణమే
చిట్టి కళ్లు మెరిశాయి.
ఆ కాగితంలోని పూవు
చిట్టి పెదాలపై విరిసింది
దాని వన్నెలూ
చిట్టి బుగ్గలపై చేరాయి.

మొక్క కొమ్మల్లో
ఇరుక్కుంది కాగితం.
చిట్టి గీసిన పూవుపై
ఓ సీతాకోకచిలుక
వచ్చివాలింది.

**- మడిపల్లి రాజ్‌కుమార్,**
**99496 99215**



### మరణించిన వారి కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే,బీజేపీ రాష్ట్ర నాయకులు శానంపూడి సైదిరెడ్డి

**హుజూర్ నగర్ మహా:** గరిడేపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మన్సూర్ అలీ తల్లి ఇటీవల అకాల మరణం చెందడంతో వారి కుటుంబ సభ్యులను హుజూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే మరియు బీజేపీ రాష్ట్ర నాయకులు శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు. అనంతరం గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన ఇన్సూరెన్స్ రాంరెడ్డి తండ్రి మరణించడంతో వారిని, వారి కుటుంబ సభ్యులు పరామర్శించడం జరిగినది



### న్యాయమూర్తి చొరవతో సుదీర్ఘ వైరానికి స్వస్తి

- లోక్ అదాలత్ లో 360క్రిమినల్ కేసులు 05 సివిల్ కేసులు రాజీ
- న్యాయమూర్తి ఆయేషా సరీనా

**హుజూర్ నగర్ మహా:** మఠంపల్లి మండలంలోని లాలీ తండాకు చెందిన బానోతు శ్రీను,బానోతు బాలు రెండు వర్గాలుగా ఉండి వారి మధ్య వైరం కొనసాగుతూ ఉంది.గత 12 సంవత్సరాల నుండి ఒక వర్గంపై మరొక వర్గం వారు వివిధ కారణాలతో ఆరోపణలు చేస్తూ ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకొనగా ఇరు వర్గాలపై మఠంపల్లి పోలీస్ స్టేషన్ నందు 08 కేసులు నమోదయి ప్రస్తుతం హుజూర్ నగర్ కోర్టులో పెండింగ్ లో ఉన్నాయి. ఇరు వర్గాలు తమ తమ న్యాయవాదులైన జక్కుల వీరయ్య, చనగాని యాదగిరి,చల్లా కృష్ణయ్య ల చేత వారి వారి కేసులను నడిపించుకుంటున్నారు ఆదివారం జరిగిన లోక్ అదాలత్ లో స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీనా చొరవ చూపి ఇరుపక్షాల న్యాయవాదులను పిలిపించి ఇరుపక్షాలపై ఉన్న కేసులను రాజీ అయ్యేవిధంగా చూడమని కోరగా ఇరుపక్షాల న్యాయవాదులు వారి వారి కక్షిదారులతో మాట్లాడి ఇరు పక్షాలను రాజీకి ఒప్పించారు.ఇరుపక్షాలు రాజీకి అంగీకరించి ఇకనుంచి ఒకరితో ఒకరు స్నేహ పూర్వక సంబంధాలు కొనసాగించడానికి అంగీకరించారు. దాంతో ఇరు వర్గాలపై ఉన్న కేసులను కొట్టివేస్తూ న్యాయమూర్తి ఆయేషా సరీనా తీర్పులు వెలువరించారు. తమ మధ్య రాజీ కుదీర్చటానికి చొరవ చూపిన న్యాయమూర్తికి ఇరుపక్షాలు ధన్యవాదాలు తెలిపారు. కాగా ఈ లోక్ అదాలత్ లో 360క్రిమినల్ కేసులు 05 సివిల్ కేసులు రాజీ అయ్యాయి.వివిధ కేసులలో కక్షిదారులు తమ తమ నేరాలను న్యాయమూర్తుల ఎదుట అంగీకరించడంతో2,70,000/రూపాయలను న్యాయమూర్తులు వారికి జరిమానా గా విధించారు. రోడ్డు ప్రమాద పరిహార మొత్తం 29 లక్షలు,ప్రామిసరీ నోటు బాకీ పైకం 04 లక్షలు,బ్యాంకుకు చెల్లించవలసిన పైకం 14,28,913/ వసూలైన పూర్తి పైకము 49,99,713/ రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమ చేయవలసిందిగా వారు ఆదేశాలు జారీ చేశారు.



### మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా అయితరాజ రవి జీవనోపాధికి కరెంటు ఇస్త్రీ పెట్టె అందజేత

**సూర్యాపేట జిల్లా మహా:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి వీరాభిమాని నల్లగొండ జిల్లా అనంతారం గ్రామం దైదావారి గూడెం వాస్తవ్యులు హైదరాబాద్ లో నివాసముంటున్న దైద కృష్ణారెడ్డి నల్లగొండ పట్టణంలో రాక్ హిల్స్ కాలనీలో నివాసముంటున్న ఆర్ ఓ జి ఫాల్క్స్ యూట్యూబ్ ఛానల్ అయితరాజు రవికి జీవనోపాధి కొరకు పదివేల రూపాయలు విలువచేసే కరెంటు ఇస్త్రీ పెట్టెను అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ, మరియు చాకలి ఐలమ్మ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నా జీవనోపాధి కొరకు ఇస్త్రీ పెట్టెను అందించిన దైద కృష్ణారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. కృష్ణారెడ్డి గతంలో కూడా తాను అనారోగ్యంతో ఉన్న సమయంలో కూడా ఆర్థిక సహాయం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్, చైర్మన్ సురకారపు యాదగిరి గౌడ్, కోశాధికారి పాలకూరి నర్సింహ గౌడ్, చాకలి ఐలమ్మ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు యలిజాల శంకర్ లకు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ సురకారపు యాదగిరి గౌడ్ మాట్లాడుతూ కృష్ణారెడ్డి వైయస్సార్ కుటుంబ సభ్యులు చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడై అలాగే ఆ దృష్టికి వచ్చినటువంటి ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయం చేస్తున్నటువంటి ఆయనకి ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియజేశారు. అలాగే కృష్ణారెడ్డి చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాల్లో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ కూడా భాగస్వామ్యం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పు పై కాంగ్రెస్ పార్టీ నిరసన

**పాల్గొన్న టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**




**మొయినాబాద్ మహా:** ఏఐసీసీ పిలుపుమేరకు రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహ రెడ్డి అధ్యక్షతన చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పామెన భీమ్ భరత్ ఆధ్వర్యంలో మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి సెక్రటరీ చల్లా వంశీచంద్ రెడ్డి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్. కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ ఇన్చార్జి బొంతు రామ్మోహన్ , రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ తదితర నాయకులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం చాలా హేమమైన చర్య దీనిని దేశ ప్రజలు ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశంలో 12 సంవత్సరాల నుంచి అరాచక పాలన నడుస్తుందని దేశంలో గాంధీ వారసత్వం లేకుండా గాడ్సే వారసత్వాన్ని తీసుకురావాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలకు 100 రోజుల ఉపాధి కోసం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. 60 రూపాయల నుంచి మొదలైన ఈ పథకం రాష్ట్రాలలో 400 నుండి 450 రూపాయలు వరకు ఇస్తున్నారని దీని ద్వారా పేదవాడికి మూడు పూటల భోజనం దొరుకుతుందన్నారు. బిజెపి 2014 నుంచి దేశంలో కులమతాల పేరిట చిచ్చుపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని దేశ ప్రజలను మోసం చేశారని తెలిపారు. దేశంలో లాభాల్లో ఉన్న ఎల్ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దేశ ప్రజలే కనువిప్పు కలగాలని ప్రజలకు వాస్తవాలు తెలియాలన్నారు. దేశం కోసం మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, ఆజాద్, సుభాష్ చంద్రబోస్ లు చేసిన త్యాగాల వలన ఇంత సౌభాగ్యంగా ఉందన్నారు. ఈ దేశం ఎవరి త్యాగాల వల్ల వచ్చిందో ప్రజలు తెలుసుకునే ప్రయత్నం చెయ్యట్లేదని దానివలన ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీంభరత్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర ఉద్యమం నాటి నుంచి నేటి వరకు భారతీయుల గుండెల్లో జాతీయపిత పేరు చిరస్మరణీయమని తెలిపారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గాంధీజీ పేరును చరిత్ర పుట్టల్లో కలిపే కుట్రలు చేస్తున్నారని అన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి పథకం పేరు మార్చడం అంతర్జాతీయ స్థాయిలో బాపూజీని అవమాన పర్చటమేనని భీంభరత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి రామ్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాన్నయ్య, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, నరేందర్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, దిశ్యత్ ముదిరాజ్. రాష్ట్ర నాయకులు మండలాల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎయిమ్స్ లో ప్రతిభ కనబరిచిన డాక్టర్ నీతు శ్రీ

**ఆల్ ఇండియా 34 ర్యాంక్**



**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ కుమార్తె డాక్టర్ నీతు శ్రీ ఎయిమ్స్ డి ఎం న్యూరాలజీ విభాగంలో ఆల్ ఇండియా 34 ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించేలా నీతు శ్రీ కష్టపడి చదవడం జరిగిందన్నారు.ఆల్ ఇండియా 34 ర్యాంకు సాధించడం గర్వంగా ఉందన్నారు కష్టపడితే సాధించలేను లేనిది అంటూ ఏదీ లేదని నీతు శ్రీ చేసి చూపించిందన్నారు. ఈ సందర్భంగా నీతూ శ్రీ మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం చదువుతే ఏదైనా సాధించవచ్చు అన్నారు.ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు ఆమెను అభినందించారు.



### జైనథ్ విద్యార్థుల ప్రతిభ

**ఆదిలాబాద్, మహా :** చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాల చెలిమి కథల పోటీల లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. జైనథ్ మండలం లక్ష్మీపూర్ కు చెందిన తల్లెల కీర్తి తో పాటు గీస శ్రీజ, పోరెడ్డి అశోక్ విజేతలు గా నిలిచారు. ఆదివారం హైదరాబాద్ లో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం లో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా. రియాజ్, బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావిశారద, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. ఎస్ .రఘు, బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్ ల చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. వీరికి ప్రశంసా పత్రం తోపాటు నగదు బహుమతి అందించి శాలువాతో సత్కరించారు. అలాగే ఉత్తమ కథలుగా ఎంపికైన కథలు ముద్రించిన ఎనిమిది పుస్తకాలను బహుమతి గ్రహీతలకు నిర్వాహకులు అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్ ప్రధానోపాధ్యాయులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన ధ్యాన మహాయాగాలు




- భారీ జ్యోతి ర్యాలీ
- ధ్యాన మహాయాగం- 4 ను ప్రారంభించిన పిరమిడ్ నిర్వాహకులు

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండల కేంద్రం లోని అన్మాస్ పల్లి గ్రామం కైలాసపురిలోని మహేశ్వర మహాపిరమిడ్ లో పత్రీజీ ధ్యాన మహాయాగం 4 అంగరంగంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.500 కార్లు ధ్యానులతో జ్యోతిని కైలసురిలోని పత్రీజీ శక్తిస్థలి తీసుకోవచ్చారు. అనంతరం పిరమిడ్ వ్యవస్థాపకులు పత్రీజీకి నివాళులు అర్పించారు.పత్రీజీ సతీమణి స్వర్ణమాల పత్రీజీ,ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ దాట్ల హన్మంతరాజు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాజీ సీబీఐ డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్, ఫౌండర్ బుద్ద సీఈవో క్వాంటమ్ ఫౌండేషన్ పి.చంద్రశేఖర్, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ సభ్యులు పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం తమ సందేశాలను విన్పించారు. ఈ సందర్భంగా ధ్యానం,శాకాహారం,పిరమిడ్ జగత్ కోసం బ్రహ్మర్షి పత్రీజీ చేసిన సేవలను కొనియాడారు.అలాగే పత్రీజీ ధ్యాన మహాయాగం 4 కార్యక్రమం అధ్బుతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. పత్రీజీ ధ్యాన మహాయాగం 4 లో మొదటి రోజు సంగీత నాధ ధ్యానం ధ్యానులకు చక్కటి అనుభూతిని కల్గిగించింది. ఉదయం జరిగిన సంగీత నాధ ధ్యానంలో పెద్ద సంఖ్యలో పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పాల్గొని ఎంతో శ్రద్ధగా మూడు గంటల పాటు ధ్యానం చేసారు.కైలాసపురి పత్రీజీ శక్తి స్థల్ శ్రీ సరస్వతి సభ ప్రాంగణంలో ప్రతీజీ ధ్యాన మహాయాగం విజయవంతంగా జరుగుతోంది. మొదటి రోజు నిర్వహించిన ప్యానల్ డిస్కెషన్ ప్రొగ్రామ్ ధ్యానులకు మంచి జ్ఞానాన్ని పంచింది. ప్యానల్ డిస్కషన్ లో జర్మన్ మాస్టర్ రమేశ్, ఫ్రాన్స్ మాస్టర్ సుధాకర్ ,మాస్టర్ ఇవాన్, కెనాడ మాస్టర్ సుమన్, యూఎస్ఏ మాస్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ధ్యానం గొప్పతనం, ధ్యానం విశిష్టత, ధ్యానంతో మనిషిలో ఎలాంటి సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయి అనే విషయాల గురించి, అలాగే ధ్యాన ద్వారా తాము పొందిన ప్రయోజనాల గురించి వివరించారు. ధ్యాన మహాయాగంలో థైయిలాండ్ కు చెందిన రాజయోగి ప్రొఫెసర్ డాక్టర్ ఇటికాన్ వాటాన పాల్గొని అధ్భుతమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా గౌతమి బుద్ధుడి బోధనల గురించి క్వాంటమ్ ఫిజిక్స్ గురించి అందరికీ అర్థమయ్యే విధంగా వివరించారు తాను ధ్యానం మొదలుపెట్టిన తర్వాత తన శరీరంలో తనలో చోటుచేసుకున్న మార్పుల గురించి వివరించి ధ్యానులకు విశేషమైన జ్ఞానాన్ని అందించారు.మహాయాగం ఉత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ధ్యానులతో పాటు ప్రపంచ దేశాలకు చెందిన ధ్యానులు సందర్శకులు హాజరయ్యారు.

## మానవత్వానికే మాయని మచ్చ..

- కోడలితో అక్రమ సంబంధం..
- కొడుకును చంపించిన తండ్రి..
- మిస్టరీని చేదించిన పోలీసులు..
- ఐదుగురు అరెస్టు..
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ రూరల్ ఎసిపి విజయ్ కుమార్..




**మహా:** మానవత్వానికే మాయని మచ్చ.. వావివరుసలు మరిసి ఏకంగా కోడలతోనే అక్రమ సంబంధం పెట్టుకున్నాడు ఓ తండ్రి. మందలించిన కొడుకును కడతేర్చేందుకు ప్లాన్ వేశాడు. అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని సూపరీ గ్యాంగ్ తో హత్య చేయించాడు. ఆపై ప్రమాదవశాత్తు చనిపోయాడని చిత్రీకరించాడు. పోలీసులు అనుమానం వచ్చి తనదైన శైలిలో విచారణ జరపడంతో అసలు విషయం బయటపడింది. తండ్రి సూపర్ గ్యాంగ్ కు డబ్బులు ఇచ్చి హత్య చేయించారని పోలీస్ విచారణ వెల్లడైంది. ఏకంగా తండ్రి కోడలుతో అక్రమ సంబంధం పెట్టుకొని కొడుకును సుపారి గ్యాంగ్ తో హత్య చేయించడం జిల్లాలో సంచలనం సృష్టించింది. ఈ కేసును పోలీసులు చేదించారు. ఈ దారుణానికి పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం తన కార్యాలయంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంల లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గాదె అంజయ్య (36) హత్య కేసును పోలీసులు ఛేదించారు. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో తండ్రి, భార్యే సుపారీ ఇచ్చి అంజయ్యను హత్య చేయించినట్లు విచారణలో తేలింది. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గాదె లచ్చయ్య (63) తన కోడలుతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. 2017లో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన కొడుకు అంజయ్య, 2019లో తిరిగి వచ్చాడు ఆ తర్వాత తండ్రి, భార్య మధ్య ఉన్న సంబంధాన్ని గమనించి హెచ్చరించాడు దీనితో తమ సాన్నిహిత్యానికి అడ్డుగా ఉన్న అంజయ్యను వదిలించుకోవాలని తండ్రి, భార్య పథకం వేశారు. నేరుగా చంపితే అనుమానం వస్తుందని భావించిన లచ్చయ్య, అదే గ్రామానికి చెందిన కొలిపాక రవి సహాయంతో సుఫారీ గ్యాంగ్‌ను సంప్రదించాడు. రవి తన బంధువైన ఉప్పరపల్లి కోటేశ్వర్, అతని స్నేహితుడు మహమ్మద్ అబ్రార్‌కు అంజయ్యను చంపేందుకు రూ. 3 లక్షల ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంజయ్యతో స్నేహం పెంచుకున్న కోటేశ్వర్, అబ్రార్ కొన్ని రోజులుగా అంజయ్యతో కలిసి మద్యం తాగుతుండేవారు. ఈ నెల 2వ తేదీన మద్యం తాగుదామని అంజయ్యను ఊరి చివర కెనాల్ సమీపంలోకి పిలిచారు. అక్కడ అతనికి అమితంగా మద్యం తాగించి, మత్తులోకి జారుకున్న తర్వాత కోటేశ్వర్ గొంతు నులుమగా, అబ్రార్ చేతులు పట్టుకుని అంజయ్యను హతమార్చారు. నిందితుడు రవి ఈ విషయాన్ని లచ్చయ్యకు చేరవేశాడు. సాక్ష్యాలను మరుగుపరచడానికి చీకటి పడిన తర్వాత మృతదేహాన్ని D8 కెనాల్ లో పడేశారు. ఐదో తేదీన కాలువలో శవం దొరకడంతో, ప్రమాదవశాత్తు పడి చనిపోయాడని నమ్మించేందుకు నిందితులు ప్రయత్నించారు. అయితే, పోలీసుల లోతైన విచారణలో లచ్చయ్య, శిరీష ప్రవర్తనపై అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో పోలీసులు గాదె లచ్చయ్య (మృతుడి తండ్రి), గాదె శిరీష (మృతుడి భార్య), ఉప్పరపల్లి కోటేశ్వర్ (సుపారీ హంతకుడు), మహమ్మద్ అబ్రార్ (సుపారీ హంతకుడు), కొలిపాక రవి మధ్యవర్తినీ అరెస్టు చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీస్ అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

## కన్హా శాంతి వనంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం

**ధ్యానంతో ఆరోగ్యం: ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ వచ్చిన భారతదేశ ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా చేగురులోని కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ధ్యానం చేయడంతో ఆరోగ్యంగా ఉండడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు ప్రతిరోజు ధ్యానం చేయడం శారీరకంగా ఎంతో మేలు జరుగుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న ఉప రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, అడిషనల్ డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, ఇతర అధికారులు, పోలీస్ అధికారులు, ఘనంగా వీడ్కోలు పలికారు.

## నేడు జిల్లాలో మాక్ ఎక్సర్ సైజ్

**జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** విపత్తులపై మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి నారాయణరెడ్డి సూచించారు. ప్రకృతి విపత్తులు, పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అవగాహనతో పాటు సన్నద్ధతను మరింత పెంపొందించేందుకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సహకారంతో ఈనెల 22న జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహించనున్న మాక్ ఎక్సర్ సైజ్ ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సి నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాక్ ఎక్సర్ సైజ్ కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై ఆదివారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మాక్ డ్రిల్ నిర్వహణకు నిర్ణీత ప్రణాళిక, ఆయా శాఖల బాధ్యతలు, అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే చేపట్టాల్సిన తక్షణ చర్యలు, సమన్వయం, సమాచార వ్యవస్థ, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మాక్ డ్రిల్‌ను ఈ నెల 22 సోమవారం నాడు నందిగామ మండలం మేకగూడ లోని నాట్కో పరిశ్రమ ఆవరణలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విపత్తులు, వరదలు, ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి, ఆస్తి, ప్రాణనష్టం నివారించేందుకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలి అనే అంశాలపై ఈ మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కలుగుతుందని, విపత్తులను ఎదుర్కొనే విషయంలో సన్నద్ధత ఏ మేరకు కలిగి ఉన్నామనేది అవగతం అవుతుందని అన్నారు.

## గురుకుల విద్యార్థులకు రోబోటిక్స్ పై అవగాహన

- విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న మెలుకువలు వెలికి తీయడమే లక్ష్యం
- బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయసాగర్ వెల్లడి




**బెల్లంపల్లి, మహా:** విద్యార్థుల్లో అంతర్లీలంగా ఉన్న వ్యక్తులను వెలికితీయడమే లక్ష్యంగా రోబోటిక్స్ పై అవగాహన కల్పిస్తున్నట్లు బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయసాగర్ వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో శనివారం పి. ఎం. శ్రీ కార్యక్రమంలో భాగంగా సోహేన్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో విద్యాలయములోని విద్యార్థులకు రోబోటిక్స్ పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులలో దాగిన ఉన్న అంతర్గత శక్తులను వెలికి తీస్తూ 21 రకాల ప్రయోగాలను చేస్తూ విద్యార్థులకు వివరించారు. అనంతరం వాటికి సంబంధించిన మెలుకువలు ఇదివరకే కల్గిన మరియు ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న విద్యార్థులను ఆయా విభాగాల్లో 22 మంది విద్యార్థులను పరీక్షించి ఎంపిక చేశారు. ఎంపిక అయిన విద్యార్థులు హైదరాబాద్ లో జరిగే శిక్షణ కు వెళ్లి వచ్చిన అనంతరం పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్ లో మిగతా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఆఖడి. విజయ్ సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ సాగర్ రాష్ట్ర స్థాయి శిక్షణ కు ఎంపికైన కెప్టెన్ రిషేంద్ర వర్మ, వైస్ కెప్టెన్ కర్రె. సనత్ కుమార్,టీంలీడర్ పూదరి. రితీశ్ ని అభినందిస్తూ వారికి బ్యాడ్జెట్స్ తదితర పరికరాలు అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సోహేన్ అకాడమీ టీం బృందం వారు మరియు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గోపి, సీనియర్ ఉపాధ్యాయులు కొండల్ రావ్,దశరథం, పాఠశాల విద్య కమిటీచెర్మెన్ రాజేశ్వర్,సభ్యులు భూపెల్లి మల్లేష్, ఉపాధ్యాయులు కమలాకర్, శ్రీకాంత్,మల్లికార్జున్, గణపతి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## గిరిపల్లెల్లో వైద్య శిబిరం

- ఉచిత మందుల పంపిణీ
- కావేరీ ఫౌండేషన్ ఔదార్యం
- ఆదివాసీలకు ఇత్తడి బిందెలు, సోలార్ లైట్లు,దుప్పట్లు స్వెట్టర్లు, వంట సామగ్రి అందజేత
- సేవలను అభినందిస్తున్న జిల్లా వాసులు



**నిర్మల్ మహా :** నిర్మల్ పట్టణంలోని అప్పాల కావేరి ఫౌండేషన్ అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ తన ఔదార్యాన్ని చాటుకుంటోంది. ఆదివారం పెంబి మండలంలోని దట్టమైన అటవీప్రాంతంలో విద్యుత్ , రోడ్డు సౌకర్యం లేని చాకిరేవు గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. చాకిరేవు, వసుపల్లి, నాయక్ పోడ్ గూడ, కొత్తగూడెం గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి సుమారు రెండు లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణి చేశారు.ఏ రకమైన సౌకర్యాలకు నోచుకోకుండా జీవిస్తున్న వీరికి ఆరోగ్యపరమైన జాగ్రత్తల గురించి ఫౌండేషన్ చైర్మన్ డా.చక్రధారి అవగాహన కలిగించారు. విద్యుత్ సౌకర్యం లేని ప్రతి ఇంటికి సోలార్ లైటింగ్ లను అందజేశారు. ఇత్తడి బిందెలను ఆదివాసీలు ఆరాధ్యంగా భావిస్తారని నాలుగు గూడాల ప్రజలకు ఇత్తడి బిందెలు అందజేశారు. అటవీ ప్రాంతంలో తీవ్రమైన చలిని దృష్టిలో పెట్టుకుని దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేసారు.పండుగలు, జాతరలు, వివాహాల సందర్భంగా వంటలు చేసుకోవడానికి విలువైన వంట సామాగ్రిని అందించారు.. వారంతపు సంతనుండి సరుకులు తెచ్చుకునేందుకు బ్యాగులను అందజేశారు.ఇంత పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టిన కావేరి ఫౌండేషన్ సేవలను జిల్లా వాసులు అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో తుమ్మల దేవరావు, నేరెళ్ల హన్మంతు , పంచాయతీ సెక్రటరీ నరేందర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆశిష్, డా. శ్రీనివాస్, మైస అరవింద్, పోలీస్ భీమేష్, దీపక్ రెడ్డి, రాజేష్ వార్డ్ మెంబర్ జంగుబాయి, హేమంత్ ,గ్రీష్మ ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు



### మారుమూల ఆదివాసీ గూడాలలో ఎస్పీ పర్యటన

**గిరిజనులకు బ్లాంకెట్ల పంపిణీ**

**ఆదిలాబాద్ మహా:** ఆదివాసీలు విద్య కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఆదివారం జిల్లాలోని సిరికొండ మండలంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తో కలిసి ఆయన పర్యటించారు.మండలం లోని కన్నాపూర్,కుంట గూడ,జెండా గూడ గ్రామాలను సందర్శించారు. శీతాకాలం దృష్ట్యా చలివిపరీతంగా ఉన్న కారణంగా ఆయా గ్రామస్తులకు 5 వందల బ్లాంకెట్లు పంపిణీ చేసారు. అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నవారు నాటు వైద్యాన్ని ఆశ్రయించకుండా , ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ గంజాయి నిర్మూలనపై జిల్లా పోలీసులకు సహకరించాలని కోరారు. ఆదివాసి సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆదివాసీ గూడాలలో సోమవారం నుండి డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించి లైసెన్స్ లేని 240 మందికి లైసెన్స్ కోసం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆదివాసీలకు వైద్య సేవల నిమిత్తం త్వరలోనే మెడికల్ క్యాంప్ ల ఏర్పాటు చేస్తామని,కుంటగూడ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిరికొండ మండల పోలీస్ స్టేషన్ ను సందర్శించి రికార్డులు పరిశీలించారు.




### పూణే కరాటే పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించిన నార్సింగికి చెందిన అక్కచెల్లెలు

**గండిపేట, మహా:** పూణే అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో నార్సింగి అక్కాచెల్లెళ్ల పతకాల పంట పండించారు. మహారాష్ట్రలోని పూణేలో ఆదివారం నిర్వహించిన 9వ అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో నార్సింగికి చెందిన అక్కాచెల్లెళ్లు జల్లి అన్విక మరియు జల్లి ఆకృతి అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. జల్లి అన్విక రెండు వేర్వేరు విభాగాల్లో తలపడి రెండు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. అదేవిధంగా, ఆమె సోదరి జల్లి ఆకృతి కుమితి విభాగంలో బంగారు పతకం, కతా విభాగంలో కాంస్య పతకాన్ని సాధించి సత్తా చాటింది. ఈ చిన్నారుల తండ్రి జల్లి రాజీవ్ గాంధీ ముదిరాజ్ మరియు తల్లి దివ్యరాణి తమ బిడ్డల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. కోచ్ ప్రసాద్ మాట్లాడుతూ.. అన్విక, ఆకృతి పట్టుదలతో శ్రమించి ఈ ఘనత సాధించారని కొనియాడారు. అంతర్రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి నార్సింగి పేరు నిలబెట్టిన ఈ అక్కాచెల్లెళ్లను పలువురు అభినందిస్తున్నారు.

# నగరంలో గుట్కా దందా

## మత్తుకు బానిస అవుతున్న యువత భవిష్యత్తు

నిషేధంలో ఉన్న కోట్లలో అమ్మకాలు
కేసులను పట్టించుకోని గుట్కా మాఫియా
పాన్ మసాలా పేర్లతో నిషేధిత గుట్కా దందా



**వరంగల్ హన్మకొండ మహా;** గుట్కా అమ్మకాలు రాష్ట్రంలో నిషేధం మే.! కానీ వరంగల్ నగరంలో బహిరంగంగానే ఎక్కడైనా గుట్కా ప్యాకెట్లు విరివిగా దొరుకుతున్నాయి. అడపాదడపా సమాచారం మేరకు కొన్నిచోట్ల టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేస్తూ వేల నుండి లక్షల రూపాయల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్నా అమ్మకాలు మాత్రం వరంగల్ హనుమకొండ జిల్లాల్లో యథేచ్ఛగా సాగుతున్నాయి.పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కాస్త ముడుపుల పైనే దృష్టి పెట్టడంతో గుట్కా అమ్మకాల పై నియంత్రణ లేకుండా పోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి గుట్టుగా రవాణా అవుతుండగా గుట్కా ప్యాకెట్ల దందా జోరుగానే సాగుతోంది. గతంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు లక్షల విలువ చేసే గుట్కాలను భారీ మొత్తంలో స్వాధీనం చేసుకొని పలువురిని అరెస్ట్ చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. నామమాత్రపు నిఘా వల్లే గుట్కా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే గుట్కా మహమ్మారి బారినపడి ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారు. వీరి ప్రాణాలను లెక్కచేయకుండా మరోవైపు వ్యాపారులు అధిక ధరలతో సొమ్ము చేసుకుంటున్నారు.

**పేర్లు మార్చి అమ్మకాలు..**

జిల్లాల్లో గుట్కా ప్యాకెట్లకు కొత్త పేర్లు పెట్టి పిలుస్తున్నారు. అర్ఎండీ, ఆర్ఆర్, గోవా, సాగర్ వంటి గుట్కా ప్యాకెట్లకు పాన్ మసాలా అని మరి కొన్నింటికి సినిమా పేర్లు పెట్టి అమ్ముతున్నారు. దాడులు జరిగిన సందర్భాల్లో రూ.5 నుంచి రూ.10 వరకు ఉండే గుట్కా ప్యాకెట్లు, అంబర్ ప్యాకెట్లను రూ.15 నుంచి రూ.20 వరకు అమ్ముతున్నారు. కొన్నిచోట్ల గుట్కా పేర్లతోనే అమ్మకాలు సాగిస్తున్నారు. పత్రికల కథనాల ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల గుట్కా దందా విపరీతంగా పెరిగిపోయిందని కర్ణాటక, మహారాష్ట్ర ల నుండి అక్రమ రవాణా జరుగుతోందని, పోలీసులు దాడులు చేస్తున్నా, వ్యాపారులు కొత్త పద్ధతుల తో పాటు ప్రత్యేక వాట్సాప్ (గ్రూపులు) గుట్కా సరఫరా చేస్తున్నారు, ఇది వ్యవస్థీకృతం అయింది, దీనివల్ల ప్రజా రోగ్యానికి హాని కలుగుతోందని, ఖాకీల ప్రమేయం పై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కథనాలు వెల్లడిస్తున్నాయి.

**అక్రమ రవాణా కేంద్రాలు:**

వరంగల్ వంటి నగరాలు, బీదర్, మహారాష్ట్ర వంటి సరిహద్దు ప్రాంతాల నుండి అర్ధరాత్రి నుండి తెల్లవారి జాము లోపే వివిధ రవాణా సౌకర్యాల ద్వారా గుట్కా పెద్ద ఎత్తున రవాణా అవుతోందని సమాచారం.

**వ్యాపార విధానాలు..**

బస్తాల్లో నింపి ట్రాన్స్పోర్ట్ ల ద్వారా, లేదా లోకల్ లో టూ వీలర్ ద్వారా అలాగే దూరప్రాంతాలకు రైళ్లలో తరలించడం, మొబైల్ గ్రూపుల ద్వారా ఆఫర్లు ఇవ్వడం, కిరాణా షాపుల మాటున గుట్కా అమ్మడం వంటివి చేస్తున్నారు.

**నిషేధం ఉన్నా కొనసాగుతోంది**

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి , గుట్కా లపై నిషేధం విధించినా, సీఎం నిషేధిత మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపాలని ఉన్నత అధికారులకు ఆదేశించిన అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని పత్రికల కథనాలే దీనిని ఎత్తిచూపుతున్నాయి.

**పోలీసుల చర్యలు & లోపాలు**

టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేస్తున్నా, కొద్ది రోజులకే హడావుడి చేసి ఆగి పోతున్నారని, ఇది వ్యవస్థీకృత దందాకు అడ్డంకి కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. నగరంలో జరుగుతున్న ఈ అక్రమ రవాణాను స్థానిక పోలీసులు వీటిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రజారోగ్య సమస్యలు**

అంబర్, కైని, గుట్కా వాడకం వల్ల నోటి క్యాన్సర్ వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గంజాయి వల్ల యువత పూర్తిగా మత్తుకు బానిస అవుతున్నారని, బంధాలను, బంధుత్వాలను మరిచి వారి ఉజ్వలమైన భవిష్యత్తును, తమ జీవితాలను మత్తు అనే మహమ్మారికి తాకట్టు పెట్టి డబ్బు కోసం దొంగతనాలకు, నేరాలకు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ జైలు పాలవుతున్నారు. వారిని చూసి తల్లిదండ్రులు మానసికంగా కృంగి కృశించి పోతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

**అధికారుల ప్రమేయం పై అనుమానం**

ఉమ్మడి జిల్లాల్లో ఇంత పెద్ద ఎత్తున గంజాయి గుట్కా అక్రమ రవాణా చేస్తున్న గుట్కా మాఫియాకు కొందరు పోలీసుల సహకారం ఉందనే ఆరోపణలు చాలా కాలంగానే వినిపిస్తున్నాయి.

**ఉదాహరణకు కొన్ని పత్రికల్లో కథనాల ప్రకారం**

వరంగల్ జిల్లాలో గుట్కా దందా పై టాస్క్ ఫోర్స్ అధికారులు అనేక దాడులు చేసి కేసులు నమోదు చేసినట్లు ప్రముఖ పత్రికలు తెలిపాయి. ముఖ్యంగా వరంగల్ ను గుట్కా రవాణా కు అడ్డాగా మార్చి, 433 కేసులు నమోదు చేసినట్లు గతంలో ఓ పత్రిక వెల్లడించింది. మొత్తం మీద గుట్కా దందా తో పాటు గంజాయి రవాణా ఒక పెద్ద సమస్యగా మారింది, పత్రికలు దీనిపై నిరంతరం కథనాలు ప్రచురిస్తూ, అధికారుల చర్యలను ప్రశ్నిస్తున్న ఈ దందాను క్షేత్రస్థాయిలో ఎందుకు అరికట్ట లేక పోతున్నారని ప్రజల తో పాటు ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికైనా సమావేశాలకు అవగాహన కార్యక్రమాలకే పరిమితం కాకుండా పూర్తిస్థాయిలో గంజాయి అక్రమ రవాణా, గుట్కా దందా పై టాస్క్ ఫోర్స్ తో పాటు స్థానిక పోలీసులు కూడా ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు నగరంలో అనుమానాలు ఉన్నచోట తనిఖీలు నిర్వహించి ఈ దంధాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అమ్మవారికి వెండిని బహుకరించిన భక్తురాలు సత్యవతి

ఆలయ అధ్యక్షులు తోట సంధ్య బాబన్న



**వరంగల్, మహా;** వరంగల్ లోని శ్రీ ధన మైసమ్మ దేవాలయ అభివృద్ధిలో భక్తులు, దాతలు తమ వంతు సహకారాన్ని భక్తిశ్రద్ధలతో అందిస్తున్నారు. ఇటీవల ఇంస్టాగ్రామ్ లో శ్రీ ధన మైసమ్మ అమ్మవారి గురించి తెలుసుకున్న విదేశీ భక్తులు కూడా అమ్మవారిని దర్శించుకోవడం నగరంలో చర్చనీయాంశమైంది. వరంగల్ మెట్ల బావి 34వ డివిజన్, శివనగర్ లో వెలసిన శ్రీ ధన మైసమ్మ అమ్మవారికి 500 గ్రాముల వెండి పాదాలు చేయిస్తానని మొక్కుకున్న భక్తురాలు 21122025 ఆదివారం శివనగర్ కు చెందిన కల్వచర్ల సత్యవతి అమ్మవారి పూజలో పాల్గొని వారి భర్త కీర్తిశేషులు కల్వచర్ల వెంకట రాములు జ్ఞాపకార్థంగా అమ్మవారికి వెండి పాదాలకు పావు కిలో వెండి కి గాను 50,001 / (అక్షరాల 50 వేల ఒక్క రూపాయి) రూపాయల నగదును ఆలయ అధ్యక్షులు తోట బాబన్న కు అందజేయడం జరిగింది. అనంతరం అధ్యక్షులు తోట బాబన్న ఆ భక్తురాలి కి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి అమ్మవారి శేష వస్త్రంతో సన్మానించారు. అనంతరం తోట బాబన్న మాట్లాడుతూ కల్వచర్ల సత్యవతి తో పాటు వారి వారి కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని ఇలాగే అమ్మవారి సేవలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవతి కుమారులు కల్వచర్ల రేఖ దయాకర్ , కల్వచర్ల మాధవిలత నవీన్ కుమార్, కల్వచర్ల కృష్ణవేణి నాగరాజు, అర్చకులు వెంకన్న , తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ కుటుంబం పేరు వింటేనే బిజెపి నేతల గుండెల్లో గుబులు

ఉపాధి హామీ నుంచి పేరును తొలగింపు అప్రజా స్వామీకం
కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించిన ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధ్యక్షుడు



**వరంగల్, మహా;** జాతీయ ఉపాధి హామీ చట్టం పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించి 'వికసిత్ భారత్ జి.రామ్.జి' పేరుతో కొత్త పథకాన్ని తీసుకు వస్తూ బీజేపీ చేస్తున్న కుట్రలకు నిరసనగా ఏఐసీసీ టీపీసీసీ ఆదేశాల మేరకు ఆదివారం వర్ధన్నపేట టౌన్ అంబేద్కర్ సెంటర్ జాతీయ రహదారి పై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బైఠాయించి మోడీ డౌన్ డౌన్ అంటూ భారీ నిరసన కార్యక్రమం చేపట్టిన ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ కుటుంబం పేరు వింటేనే బిజెపి నేతల గుండెల్లో గుబులు మొదలవుతుందని బీజేపీ నేతలు అధికారం ఉంది కదా అని దుర్మార్గమైన నిర్ణయం తీసుకోవడం పట్ల ఎమ్మెల్యే నాగరాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతి భారతీయుని గౌరవం దెబ్బ తీసేలా తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అట్టడుగు పేద ప్రజలకు కరువు కాటకాల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ తీసుకున్న గొప్ప పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆరోపించారు. సోనియా, రాహుల్ మీద కోపంతో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఆక్షేపించారు. పార్లమెంట్‌లో ఈ చట్టం వెనక్కి తీసుకొనేంత వరకూ పల్లెలు ఏకం కావాలని ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధ్యక్షులు అయూబ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల పాలిట కల్పవృక్షం ఉపాధి హామీ పథకం

- ఉపాధి హామీ చట్టంలో పేరు మార్పును ఉప సంహరించు కోవాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని




**హన్మకొండ మహా;** కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దేశంలో స్వర్ణయుగం ఉన్నదని, అట్టడుగు వర్గాల ప్రజలకు మెరుగైన పాలన అందించామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించాలని బిల్లు ప్రవేశపెట్టిన క్రమంలో ఏఐసీసీ,టీపీసీసీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత పబ్లిక్ గార్డెన్స్ లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక సంక్షేమ పథకం కాదు – అది చట్టబద్ధమైన పేద ప్రజల హక్కు గా ఆయన అభివర్ణించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గాయని, స్థానికంగా ఉపాధి కల్పన జరిగిందని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించిన పథకంగా ఇది దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు ఈ పథకం ఒక రక్షణ కవచంలా పనిచేసిందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. గ్రామాల్లో చెరువులు, కాలువలు, రహదారులు, పచ్చదనం పెంపు వంటి ఆస్తుల సృష్టి జరిగింది ఈ ఉపాధి హామీ పథకం వల్లనే అని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీలకు అధికార వికేంద్రీకరణ జరిగిందని పేరు మార్చడం ద్వారా కాదు, ప్రజలకు హక్కులు కల్పించడం ద్వారానే నిజమైన వికసిత్ భారత్ సాధ్యమవుతుందని చట్టాల పేర్లు మార్చడం రాజకీయ ప్రచారం తప్ప ప్రజలకు ఉపయోగం లేదని తెలిపారు. గత 11 నెలలుగా ఉపాధి హామీ పథకానికి తగిన బడ్జెట్ కేటాయింపులు చేయడంలో పూర్తిగా విఫలమైందని పనిదినాలు తగ్గించి, కూలీలకు చెల్లింపులు ఆలస్యం చేయడం ద్వారా పేదల జీవనాన్ని దెబ్బతీసింది. పేదలకు పని కల్పించాల్సిన పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కొత్త పేర్లు, కొత్త మిషన్లు తెస్తోందని కోవిడ్ తర్వాత పెరిగిన నిరుద్యోగాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం వద్ద స్పష్టమైన ప్రణాళిక లేదని విమర్శించారు.గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుతున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతులు, కూలీల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీలు మాటలకే పరిమిత మయ్యాయని విమర్శించారు. ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు నలిగిపోతుంటే కేంద్రం స్పందించడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ తీసుకొచ్చిన ప్రజాహిత చట్టాలను కూల్చి వేయడమే బీజేపీ లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే నాయిని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి శ్రీనివాస్ రావు, టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్ రావు,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోక వెంకటేశ్వర్లు,జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్పొరేటర్లు,మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయి

**వరంగల్ మహా;** డిసెంబర్ 22వ తేదీన జిడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు జిడబ్ల్యూఎంసీ కమిషనర్ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు ఫిర్యాదులు ఇచ్చుటకు బల్దియా కార్యాలయానికి రాకూడదని కమిషనర్ కోరారు.



## నేడు చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద మాక్ ఎక్సర్సైజ్

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా:** జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఏ) మార్గదర్శకాల ప్రకారం, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు నేడు జరగబోయే మాక్ ఎక్సర్సైజ్ (డ్రిల్) లో భాగంగా ఆదివారం ఎస్డిఆర్ఎఫ్ బృందం ట్రయల్ మాక్ ఎక్సర్సైజ్ (డ్రిల్) నిర్వహించారు. వరదల సమయంలో సంబంధిత ప్రభుత్వ శాఖల మధ్య భాగస్వామ్య సమన్వయం, సంసిద్ధత ప్రతి స్పందనలను అంచనా వేయడంలో భాగంగా వరంగల్ నగరంలోని దేశాయిపేట చిన్న వడ్డేపల్లి చెరువు లో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, ఎమ్మార్వో శ్రీకాంత్, ఏపీఆర్ఓ ప్రేమలత, ఆర్ ఐ లు కృష్ణస్వామి, దినాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానం విద్యార్థుల ఏకాగ్రతకు మార్గం




- ధ్యానంతో మనశ్శాంతి..మానసిక ఒత్తిడి తగ్గుతుంది
- ప్రో. వి రామచంద్రం, కేయూ రిజిస్ట్రార్
- కళ్ళకు గంతలు కట్టుకొని పుస్తకం చదివిన విద్యార్థి

**హన్మకొండ, మహా;** హనుమకొండ లోని కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ లో మూడు రోజులపాటు డీన్, స్టూడెంట్ అఫైర్స్, యోగా సెంటర్ ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్ నెస్ సంస్థ సహకారంతో జరిగిన హార్ట్‌ఫుల్‌నెస్ ఫర్ అకాడెమిక్ ఎక్సలెన్సీ వర్క్‌షాప్ వైభవంగా ముగిసింది. విద్యార్థుల అకాడెమిక్ ప్రయాణంలో ధ్యానం, యోగా, హార్ట్‌ఫుల్‌నెస్ సాధన ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఈ వర్క్‌షాప్‌లో అనేక ప్రేరణాత్మక సెషన్లు నిర్వహించబడ్డాయి. ఆదివారం కేయూ లోని సెనేట్ హాల్ లో మూడవ రోజు "అంతరంగం తో అనుసంధానం" అనే అంశంపై ప్రొఫెసర్ జి. ఆచయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ తన ఉపన్యాసాన్ని అందించారు. అనంతరం ఎస్. శాంతి స్వరూప్ విద్యార్థులకు ఆచరణాత్మక మార్గదర్శకత్వం ఇచ్చారు. డాక్టర్ రాంబాబు ప్రాక్టీస్ సెషన్ నిర్వహించి విద్యార్థులను ధ్యాన సాధనలోకి నడిపించారు. అనంతరం ఎస్. శ్రీధర్ ప్రత్యేక ధ్యాన సెషన్ నిర్వహించారు.

**అబ్బురపరిచిన విద్యార్థి ప్రతిభ....**

ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను అబ్బురపరిచే "బ్రైటర్ మైండ్స్ డెమో" కూడా జరిగింది. ఎం సుహాస్ ఆధ్వర్యంలో ఓ విద్యార్థి కళ్ళకు గంతలు కట్టుకొని పుస్తకం చదివి అద్భుత ప్రతిభను ప్రదర్శించాడు. ఈ ప్రదర్శన విద్యార్థులు, అధ్యాపకులు, అతిథులను ఆశ్చర్యానికి గురి చేసింది.

**వైభవంగా ముగిసిన మెడిటేషన్ డే ఉత్సవాలు**

వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా గత మూడు రోజుల నుండి జరుగుతున్న వర్క్ షాప్ ముగింపు కార్యక్రమం కేయూ సెనేట్ హాల్ లో వైభవంగా జరిగింది. ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొ మామిడాల ఇస్తారి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ మాట్లాడుతూ మూడు రోజుల వర్క్ షాప్ లో 400 కి పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన వర్క్ షాప్ లో ధ్యానంలో శిక్షణనిచ్చిన హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి రామచంద్రం మాట్లాడుతూ ఈ మూడు రోజుల హార్ట్‌ఫుల్‌నెస్ ఫర్ అకాడెమిక్ ఎక్సలెన్సీ వర్క్‌షాప్ విజయవంతంగా ముగియడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని, విద్యార్థుల అకాడెమిక్ ప్రయాణంలో ధ్యానం, యోగా, హార్ట్‌ఫుల్‌నెస్ సాధన ఎంతో ముఖ్యమైనవనీ, ఇవి విద్యార్థులలో ఏకాగ్రతను పెంచి, ఒత్తిడిని తగ్గించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయనీ అన్నారు. ఈ వర్క్‌షాప్‌లో మీరు నేర్చుకున్న రిలాక్సేషన్, నిర్మలీకరణం, ధ్యానం వంటి పద్ధతులు మీలోని అంతరంగ శక్తిని వెలికితీయడానికి సహాయపడతాయనీ, అంతరంగం తో అనుసంధానం అనే అంశం ద్వారా మనం మనసును లోతుగా పరిశీలించి, మన లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవచ్చనీ అన్నారు. అకాడెమిక్ ఎక్సలెన్సీ సాధించాలంటే కేవలం పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల ఆలోచనలతో ముందుకు సాగడం అవసరమని, ధ్యానం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటే, విద్యార్థులు తమ ప్రతిభను మరింత మెరుగ్గా ప్రదర్శించగలరనీ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం తన గోల్డెన్ జూబిలీ వేడుకల సందర్భంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఇలాంటి అనేక కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది. ఒక రిజిస్ట్రార్‌గా నేను విద్యార్థుల కోసం ఎల్లప్పుడూ చేయూతనిస్తాననీ, మీలో ప్రతి ఒక్కరు ఈ అవకాశాలను వినియోగించుకొని, మీ విద్యా ప్రయాణాన్ని మరింత అర్థవంతంగా మార్చుకోవాలని హితవు పలికారు. తదనంతరం మూడు రోజుల పాటు మెడిటేషన్ నేర్చుకున్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్ లు అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నిర్వహాక కమిటీ బాధ్యులు దేవీ ప్రసాద్, కందగట్ల వికాస్, గాయత్రి, ప్రశాంక్, శృతి, అలోక్, హరివర్ధన్, అహల్య, లీనస్రి, సోఫియా, నవ్య, నరేందర్, లిఖిత లతో పాటు కేయూ పరిధిలో ఉన్న పీజీ కాలేజీల విద్యార్థిని విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


## న్యాయ ఫలాలు బాధితులకు అందేలా చూడాలి

అదనపు జిల్లా న్యాయమూర్తి రాధాకృష్ణ చౌహన్

**హుజూర్ నగర్ మహా:** న్యాయాన్ని కోరుకుంటూ కోర్టులను ఆశ్రయించిన బాధితులకు తక్షణ న్యాయ సహాయం అందే విధంగా న్యాయవాదులు కృషి చేయాలని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి రాధాకృష్ణ చౌహన్ న్యాయవాదులను కోరారు. అదనపు జిల్లా న్యాయమూర్తి రాధాకృష్ణ చౌహన్ ను సికింద్రాబాద్ లోని జ్యుడిషియల్ అకాడమీకి బదిలీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం బదిలీ చేయబడిన స్థానం నుండి రిలీవ్ కావలసిందిగా ఉత్తర్వులు జారీ చేయడంతో ఆదివారం హుజూర్ నగర్ కోర్టు హాల్ నందు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు సమావేశంలో న్యాయవాదులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యువ న్యాయవాదులు అనునిత్యం అధునాతన న్యాయ గ్రంథాలను, న్యాయ శాస్త్రాలను,ఉన్నత న్యాయస్థానాలు వెలువరించే తీర్పులను నిరంతరం చదువుతూ న్యాయ విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. హుజూర్ నగర్ కోర్టులో తను అతి కొద్ది కాలం పాటే పని చేసినప్పటికీ న్యాయవాదులు తనకు సహకరించిన తీరు ఈ ప్రాంత వాతావరణం ఎన్నటికీమర్చిపోలేనన్నారు తన విధి నిర్వహణలో భాగంగా ఏదైనా సందర్భంలో కఠినంగా వ్యవహరించినట్ల యితే అది వృత్తిపరమైన చర్య తప్ప వ్యక్తిగతం కాదన్నారు.తనకు అన్ని విధాలుగా సహకరించిన బార్ అసోసియేషన్ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీనా లు మాట్లాడుతూ తమకు ఉద్యోగ పరంగా ఏదైనా సందేహం ఏర్పడినప్పుడు అదనపు జిల్లా న్యాయమూర్తి చేత నివృత్తి చేసుకునే వారమని ఉద్యోగ పరంగా వారు మాకు అనేక రకాలుగా సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ జిల్లా న్యాయమూర్తి కొద్ది కాలం పాటే ఇక్కడ పనిచేసినప్పటికీ తమలో ఒకడిగా మిళితమై పోయారని ప్రస్తుతం అతనిని వదిలి పెట్టుకోవడం తమకు ఇబ్బందిగా మారిందన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ దెబ్బకి చతికల పడ్డ కాంగ్రెస్

గెలిచిన సర్పంచ్ లకు సన్మానం చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**వరంగల్ మహా;** ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నేతృత్వంలో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన నూతన సర్పంచుల ను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీ లో ఉంటూ పార్టీకి నమ్మక ద్రోహం చేస్తున్నంటువంటి ద్రోహుల పై ఆయిన మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని అధికార మదంతో అధికారులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్నో ప్రలోభాలకు గురి చేసినా.. తట్టుకొని నిలబడి విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ ల పోరాట పటిమ అద్భుతమని కొనియాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 60 శాతం ఓట్లు గెలుచు కోగా ఈ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ 30% శాతానికి పడిపోవడం దేనికి నిదర్శనమని అన్నారు. చిన్న చిన్న ఓటు బ్యాంక్ ఉన్న గ్రామాలను బెదిరించి బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులను వాళ్ళ పార్టీ లో చేర్పించుకొని గెలిచామని చెప్పుకుంటున్నారు. మేజర్ గ్రామాలన్నీ తమ పార్టీ వైపే ఉన్నాయని ఈ ఎన్నికలు నిరుపించాయని తెలిపారు. ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ బిఆర్ఎస్ మంచి ఆదరణ పొంది రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలలో ముందంజలో ఉండటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అధికారాన్ని, పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికలకు తెలంగాణ ప్రజలు ఓటు తోనే గట్టి గుణపాఠం చెప్పారని ఎర్రబెల్లి గుర్తు చేశారు. ఈ గెలుపు బీఆర్ఎస్ కార్యకర్తల మనో ధైర్యానికి నిదర్శనమని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఈ ఫలితాలు స్పష్టం చేశాయని తెలిపారు.



ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి

## సన్మానించిన కాంగ్రెస్ నూతన సర్పంచ్ వార్డు మెంబర్‌లు


**హుజూర్ నగర్, మహా:** యాతవాకిళ్ళ సర్పంచిగా ఎన్నికయిన కుక్కల కరుణనాగరాజు మరియు గ్రామ ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కాసాని వీరమ్మ మఠంపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటి పులి శ్రీనివాస్,ఉపసర్పంచ్ బొమ్మ కంటి బాలనాగయ్య వార్డ్ మెంబర్ లు మాలోత్ బాలు, కుక్కల పెద్ద సైదులు, కుక్కల భాస్కర్ రావు రాచమల్ల స్రవంతి నక్క శ్రీదేవి,మాలోత్ వినోద్ లు మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి ని హుజూర్ నగర్ మంత్రి క్యాంపు కార్యాలయంలో యాతవాకిళ్ళ గ్రామ ఇంచార్జ్ తన్నీరు మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ యాతవాకిళ్ళ ప్రజలు కుక్కల కరుణనాగరాజును సర్పంచిగా అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు గ్రామ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని ముందుగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# రైల్వే ఛార్జీల పెంపు.. 26 నుంచే కొత్త రేట్లు



భారతీయ రైల్వేస్ కీలక ప్రకటన చేసింది. టికెట్ ధరలను పెంచుతున్నట్లు పేర్కొంది. పెరిగిన ఛార్జీలు ఈ నెల 26 నుంచి అమల్లోకి రానున్నాయి. తాజాగా పెంచిన రేట్ల ప్రకారం.. లోకల్, స్వల్ప దూర ప్రయాణాల టికెట్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. అయితే.. అంతకంటే ఎక్కువ దూరం వెళ్లే.. ఆర్డినరీ క్లాస్ రైలు టికెట్ ధర కిలోమీటరకు 1 పైసా చొప్పన పెంచింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్ ఏసీ, నాన్‌ఏసీ రైళ్లలో కిలోమీటరకు 2 పైసలు చొప్పున ఛార్జీలు పెంచింది. ఇక నాన్ ఏసీ ట్రైన్‌లో 500 కి.మీ దూరం ప్రయాణించే వారు అదనంగా రూ.10 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. పెరుగుతున్న ఖర్చులను బ్యాలెన్స్ చేస్తూనే.. ఎక్కువ మంది ప్రయాణికులకు రైల్వే సేవలను చేరువ చేయాలనే లక్ష్యంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

చివరిసారి రైల్వే ఛార్జీల పెంపు 2025 జూలైలో జరిగింది. ఆ పెంపుతో రైల్వేకు సుమారు రూ.700 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది. తాజా పెంపుతో దాదాపు రూ.600 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరుతుందని రైల్వేశాఖ అంచనా వేస్తోంది.



## ఫుడ్ డెలివరీ యాప్‌లు
# వద్దు బాబోయ్..

దేశంలో ఫుడ్ డెలివరి యాప్‌లు విస్తృతంగా పెరిగిపోయాయి. వాస్తవంగా ఈ యాప్‌లు రెస్టారెంట్ పరిశ్రమకు కస్టమర్లను, ఆదాయాన్ని అందిస్తున్నాయి. ఈ యాప్స్‌ను నమ్ముకుని హోటళ్లు, రెస్టారెంట్లు నడుస్తున్నాయా.. లేక రెస్టారెంట్లపై ఆధారపడి ఫుడ్ డెలివరి యాప్‌లు పనిచేస్తున్నాయా అంటే చెప్పడం కష్టం. అయితే ఇవే ఫుడ్ డెలివరి యాప్‌లు రెస్టారెంట్లకు ఆర్థికంగా, కార్యాచరణపరంగా ఒత్తిళ్లను కూడా తెస్తున్నాయి. ప్రోసస్ సౌజన్యంతో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (NCAER) దేశవ్యాప్తంగా నిర్వహించిన తాజా అధ్యయనం ఫుడ్ డెలివరి యాప‌్‌లు, రెస్టారెంట్ల మధ్య నలుగుతున్న వివాదాస్పద ఘర్షణను వెలుగులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా వివిధ నగరాలు, ప్రాంతాల్లోని రెస్టారెంట్లతో నిర్వహించిన వివరణాత్మక సర్వేలో కీలక వివరాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం.. ప్రస్తుతం ఫుడ్ డెలివరీ ప్లాట్ ఫామ్‌లను ఉపయోగిస్తున్న రెస్టారెంట్లలో 35 శాతం అవకాశం ఉంటే ఈ యాప్‌ల నుండి నిష్క్రమించాలనే అనుకుంటున్నాయి. అదే సమయంలో దాదాపు మూడింట రెండు వంతుల రెస్టారెంట్లు మాత్రం ఫుడ్ డెలివరీ యాప్‌లతో కొనసాగేందుకు మొగ్గు చూపుతున్నాయి.

**అధిక కమీషన్లు**

ఫుడ్ డెలివరీ యాప్‌లపై రెస్టారెంట్ల అసంతృప్తికి ప్రధాన కారణం ప్రతి ఆర్డర్‌పై అవి వసూలు చేపసే కమీషన్. నివేదిక ప్రకారం.. ప్లాట్ ఫామ్ కమీషన్లు కొన్నాళ్లుగా పెరిగిపోయాయి. బిల్లు మొత్తంలో వాటి వాటా గణనీయంగా ఉంటోంది. చాలా మంది రెస్టారెంట్ యజమానులకు, ఆర్డర్ వాల్యూమ్‌లు బలంగా ఉన్నప్పటికీ, కమీషన్ల కారణంగా ఆర్డర్‌కు వచ్చే నికర ఆదాయాలు తగ్గిపోయాయి. "సగటు 'పర్ ఆర్డర్' కమిషన్ 2019లో 9.6 శాతం ఉండగా 2023 వచ్చే సరికి అది 24.6 శాతానికి పెరిగింది.

**సొంత డెలివరీ యాప్‌ల వైపు రెస్టారెంట్లు**

అధిక కమిషన్లు, నియంత్రణల కారణంగా అనేక రెస్టారెంట్లు ఇప్పుడు తమ సొంత డెలివరీ యాప్‌లు, వెబ్‌సైట్లను అభివృద్ధి చేసుకుంటున్నాయి. దీనివల్ల మధ్యవర్తుల అవసరం తగ్గుతుంది. కమిషన్ల భారం ఉండదు. కస్టమర్ డేటాపై పూర్తి నియంత్రణ ఉంటుంది. లాభాల మార్జిన్ మెరుగుపడుతుందని రెస్టారెంట్ల నిర్వాహకులు భావిస్తున్నారు. పెద్ద చైన్ రెస్టారెంట్లు మాత్రమే కాకుండా, మధ్యస్థ స్థాయి హోటళ్లు కూడా వాట్సాప్ ఆర్డర్లు, లోకల్ డెలివరీ బాయ్స్ సహాయంతో ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నాయి.

**బ్రాండ్ విలువకు దెబ్బ**

ఫుడ్ డెలివరీ యాప్‌లు తరచూ భారీ డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, ఫెస్టివ్ డీల్స్ వంటి వాటిని రెస్టారెంట్లపై ఒత్తిడి చేసి అమలు చేయిస్తున్నాయి. దీని వల్ల రెస్టారెంట్ ధరల స్వతంత్రత కోల్పోతుంది. బ్రాండ్ విలువ తగ్గుతోంది. ఆఫ్‌లైన్ కస్టమర్లతో ధరల అసమతుల్యత ఏర్పడుతుంది.

# వీధి దీపాల కింద చదువుకుని ప్రపంచ గుర్తింపు: కొనియాడిన అంబానీ

శాస్త్రీయ రంగంలో ప్రతిభను మరియు "నవ భారత్" స్ఫూర్తిని కొనియాడుతూ జరిగిన ఒక ప్రత్యేక సాయంత్రం వేళ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ.. దిగ్గజ శాస్త్రవేత్త డాక్టర్ రఘునాథ్ అనంత్ మషేల్కర్‌కు ఘన నివాళులర్పించారు. డాక్టర్ మషేల్కర్ రికార్డు స్థాయిలో 54 గౌరవ డాక్టరేట్లు పొందిన అసాధారణ విద్యా మైలురాయిని పురస్కరించుకుని, ఒక ప్రత్యేక సన్మాన కార్యక్రమం, పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ వేడుకలో ప్రొఫెసర్ ఎం.ఎం. శర్మ, మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి చంద్రకాంత్ పాటిల్, శాస్త్రీయ రంగానికి చెందిన ప్రముఖులు, పారిశ్రామిక దిగ్గజాలు పాల్గొన్నారు.

**వీధి దీపాల కింద చదువుకుని ప్రపంచ గుర్తింపు వరకు**

సభికులను ఉద్దేశించి అంబానీ మాట్లాడుతూ, ముంబై వీధి దీపాల కింద చదువుకున్న ఒక సామాన్య బాలుడు ప్రపంచ స్థాయి శాస్త్రీయ ఐకాన్‌గా ఎదిగిన డాక్టర్ మషేల్కర్ ప్రయాణాన్ని వివరించారు. "డాక్టర్ మషేల్కర్ జీవిత ప్రయాణంలో నేను ఆధునిక భారతదేశ ప్రయాణాన్ని చూస్తున్నాను," అని అంబానీ పేర్కొన్నారు. "అతను పేదరికం నుంచి ప్రపంచ స్థాయి గౌరవం వరకు ఎదిగారు. దీనికి కారణం వారి తల్లి అంజనీ గారి ప్రేమ, ఆయన ఉక్కు సంకల్పమే." చాలామంది జీవితంలో ఒక డిగ్రీ పొందడానికే కష్టపడతారని, కానీ మషేల్కర్ గారు 54 డాక్టరేట్లు సాధించారని అంబానీ కొనియాడారు. అంత ఎదిగినా ఆయన ఎంతో వినయంగా ఉంటారని, "పండ్లతో నిండిన




చెట్టు ఎప్పుడూ కిందకే వంగి ఉంటుంది" అనే సామెత ఆయనకు సరిగ్గా సరిపోతుందని అన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌పై డాక్టర్ మషేల్కర్ చూపిన ప్రభావం ఈ ప్రసంగంలో ప్రధానాంశంగా నిలిచింది. రిలయన్స్‌ను కేవలం ప్రాజెక్టులను అమలు చేసే సంస్థ నుంచి సైన్స్ ఆధారిత ఆవిష్కరణల (Innovation) దిశగా మళ్లించడంలో మషేల్కర్, ప్రొఫెసర్ ఎం.ఎం. శర్మల పాత్ర కీలకమని అంబానీ అంగీకరించారు. 2000వ సంవత్సరంలో మషేల్కర్ సూచన మేరకు స్థాపించబడిన రిలయన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కంపెనీ సంస్కృతినే మార్చివేసిందని ఆయన వెల్లడించారు. నేడు రిలయన్స్‌లో 1,00,000 కంటే ఎక్కువ మంది సాంకేతిక నిపుణులు ఉన్నారని గర్వంగా చెప్పారు. "రిలయన్స్‌ను ఒక పారిశ్రామిక సంస్థగా కాకుండా, ఒక సైన్స్ కంపెనీగా చూడాలని ఆయన మాకు నేర్పారు," అని అంబానీ అన్నారు. ముఖ్యంగా జియో & గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు మషేల్కర్ దార్శనికతకు నిలువుటద్దాలని పేర్కొన్నారు.

**'గాంధీ ఇంజనీరింగ్' మరియు కృత్రిమ మేధ (AI)**

ఈ సందర్భంగా డాక్టర్ మషేల్కర్ రాసిన తాజా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో ఆయన ప్రసిద్ధ సిద్ధాంతమైన *"More from Less for More"* (తక్కువ వనరులతో ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చేలా ఎక్కువ ఉత్పత్తి చేయడం) గురించి వివరించారు. దీనినే ఆయన 'గాంధీ ఇంజనీరింగ్' అని పిలుస్తారు. ఈ సిద్ధాంతాన్ని ప్రస్తుత కృత్రిమ మేధ (AI) యుగానికి అన్వయిస్తూ, అంబానీ ఒక ముఖ్యమైన మాట చెప్పారు: "AI రంగంలో భారత్ ప్రపంచ నాయకత్వం వహించాలి, కానీ 'కరుణ లేని సాంకేతికత.. కేవలం యంత్రం మాత్రమే' అని మనం గుర్తుంచుకోవాలి." తెలివితేటలతో పాటు సానుభూతిని, సంపదతో పాటు లక్ష్యాన్ని జోడించడం ద్వారా భారత్ ప్రపంచానికి కొత్త అభివృద్ధి నమూనాను చూపగలదని ఆయన ఆకాంక్షించారు. క్వాంటం కంప్యూటింగ్, సింథటిక్ బయాలజీ, స్పేస్ టెక్నాలజీ వంటి రంగాలలో భారత్ "డీప్‌టెక్ సూపర్ పవర్"గా ఎదగాలంటే, పారిశ్రామిక రంగం & విద్యా సంస్థల మధ్య బలమైన అనుసంధానం ఉండాలని అంబానీ పిలుపునిచ్చారు. ప్రసంగం ముగియగానే, అంబానీ "జ్ఞాన యోగి" అని పిలిచిన డాక్టర్ మషేల్కర్‌కు సభికులందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో గౌరవ వందనం సమర్పించారు.

## రూ. 16వేలు పెరిగిన
# వెండి రేటు..
## వారంలోనే ఇంతలా




బంగారం ధరలు మాదిరిగా కాకుండా.. వెండి ధరలు ఊహకందని రీతిలో పెరిగిపోతున్నాయి. వారం రోజుల్లో (డిసెంబర్ 14 నుంచి 20 వరకు) సిల్వర్ రేటు ఏకంగా రూ. 16,000 పెరిగింది. దీన్ని బట్టి చూస్తే వెండి రేటు ఏ స్థాయిలో పెరిగిందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. 2025 డిసెంబర్ 14న రూ. 2,10,000 వద్ద ఉన్న కేజీ వెండి రేటు.. 20వ తేదీ (శనివారం) నాటికి రూ. 2,26,000లకు చేరుకుంది. దీన్నిబట్టి చూస్తే.. ఒక గ్రామ్ సిల్వర్ రేటు 226 రూపాయలకు చేరిందన్న మాట. వారం రోజుల్లో రెండు రోజులు మాత్రమే తగ్గిన రేట్లు, మిగిలిన నాలుగు రోజులు పెరుగుదల దిశగానే వెళ్లాయి.

**వెండి రేటు పెరగడానికి ప్రధాన కారణాలు**

వెండిని కేవలం.. ఆభరణాల రూపంలో మాత్రమే కాకుండా, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి, టెలికాం, వైద్య సాంకేతికత, బయోఫార్మా వంటి పరిశ్రమలలో విరివిగా ఉపయోగిస్తున్నారు. సౌర ఫలకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ భాగాలలో కూడా సిల్వర్ కీలకంగా మారింది. ఇవన్నీ వెండి డిమాండును అమాంతం పెంచడంలో దోహదపడ్డాయి. ఇది ధరల పెరుగుదలకు కారణమైంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# మళ్లీ ఎప్‌స్టీన్ కలకలం




వాషింగ్టన్: అమెరికన్లు కొద్ది రోజులుగా ఉత్కంఠతో ఎదురు చూస్తున్న జెఫ్రీ సెక్స్ కుంభకోణం తాలూకు మరిన్ని ఫైల్స్ తాజాగా వెలుగులోకి వచ్చాయి. మొత్తం 3 లక్షలకు పైగా డాక్యుమెంట్లు, 3,500 ఫైల్స్, భారీగా ఫోటోలను న్యాయ శాఖ శుక్రవారం విడుదల చేసింది. రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖుల లైంగికానందం కోసం ఎప్‌స్టీన్ మహిళలను, ముఖ్యంగా బాలికలను సరఫరా చేసిన వైనం 20 ఏళ్ల కింద అమెరికాలో సంచలనం రేపడం తెలిసిందే. దాని తాలూకు ప్రకంపనాలు ఇప్పటికీ సద్దుమణగలేదు. అయితే తాజా ఫైల్స్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇబ్బంది కలిగించే అంశాలేవీ పెద్దగా లేవు. ఆయనకు సంబంధించి అభ్యంతరకరంగా లేని కొన్ని ఫొటోలు మాత్రమే ఉన్నాయి. విపక్ష డెమొక్రటిక్ పార్టీకి చెందిన మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు సంబంధించి మాత్రం చాలా ఫొటోలు ఉండటం విశేషం. వాటిలో ఆయన హాట్ టబ్‌లో, పూల్‌లో పలువురు మహిళలతో సేదదీరుతూ కనిపిస్తున్నారు. ఆయనేగాక పాప్ స్టార్ మైకేల్ జాక్సన్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, నాటి పలువురు హాలీవుడ్ హీరోలు ఎప్‌స్టీన్ పార్టీలకు హాజరైన ఫొటోలు కూడా విడుదలైన ఫైల్స్‌లో ఉన్నాయి.

**20 ఏళ్ల కేసు:**

2005 మార్చిలో ఒక బాలిక కుటుంబం ఫిర్యాదుతో ఎప్‌స్టీన్ లీలలు తొలిసారిగా వెలుగులోకి వచ్చాయి. పామ్ బీచ్ కౌంటీలోని తన నివాసంలో పలువురు రాజకీయ తదితర ప్రముఖుల లైంగికానందం కోసం ఎప్‌స్టీన్ పలువురు బాలికను వాడుకున్నాడని వారు ఆరోపించారు. జనాగ్రహం నేపథ్యంలో అరెస్టైన అతడు 2019లో జైల్లోనే అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎప్‌స్టీన్ కస్టమర్ల జాబితాలో ట్రంప్ కూడా ఉన్నారని విపక్ష డెమొక్రటిక్ పార్టీ ఆరోపణలు చేస్తూ వస్తోంది. సొంత రిపబ్లికన్ పార్టీ నేతలు కూడా డిమాండ్ చేస్తుండటంతో ట్రంప్ ఇరకాటంలో పడ్డారు. వాటిని బయట పెట్టాలని ఆదేశిస్తూ కాంగ్రెస్ కూడా బిల్లును ఆమోదించడంతో ఇటీవలే దానిపై సంతకం పెట్టారు.

**ఆయుర్వేదం ప్రస్తావన!**

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఆయుర్వేదం, అందులో పేర్కొన్న పలు మసాజ్ పద్ధతుల గురించిన ప్రస్తావన ఉండటం విశేషం. '5 వేల ఏళ్ల పురాతనమైన భారత సహజ చికిత్సా ప్రక్రియను ఇప్పుడు పాశ్చాత్య దేశాల్లో కూడా చాలామంది అనుసరిస్తున్నారు' అని వాటిలో పలుచోట్ల చెప్పుకొచ్చారు. అంతేగాక 'మసాజ్ చేసే కళ' పేరిట పలు వ్యాసాలు కూడా వాటిలో ఉన్నాయి!

# ఆర్‌ఎస్‌ఎస్‌ను అలా చూడద్దు..





## మోహన్ భాగవత్

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు ఎటువంటి రాజకీయ అజెండా లేదని ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఆదివారం కోల్‌కతాలో జరిగిన సంఘ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంఘ్ గమ్యాలను బీజేపీ దృష్టికోణంతో చూస్తున్నారని ఇది చాలా తప్పని మోహన్ భాగవత్ హెచ్చరించారు.


ప్రస్తుతం కాషాయపార్టీ హవా దేశవ్యాప్తంగా నడుస్తోంది. వరుసగా మూడోసారి గెలిచి కేంద్రంలో అధికారం ఏర్పాటు చేయడంతో పాటు చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. అయితే చాలా మంది బీజేపీకి బ్యాక్‌గ్రౌండ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తుందంటుంటారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ రెండింటి భావజాలాలు దాదాపు ఒకటే అని అంటుంటారు. అయితే ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఈ మేరకు సంచలన ప్రకటన చేశారు. స్వయంసేవక్ సంఘ్ భావనలను సంకుచిత భావజాలంతో చూడడం చాలా తప్పని మోహన్ భాగవత్ అన్నారు. "చాలా మంది బీజేపీ దృష్టితో సంఘ్‌ని చూస్తారు. ఇది చాలా తప్పు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదు. కేవలం హిందూ సమాజం రక్షణ అభివృద్ధి కోసమే ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుంది". అని ఆయన తెలిపారు. సంఘ్ ప్రజలను ఉన్నతమైన వ్యక్తులుగా మారేలా చేస్తోందని వారిలో నైతిక విలువలు పెంపోందించేలా శిక్షణ ఇస్తుందని ఆయన తెలిపారు. తద్వారా వారు భారతదేశ గౌరవాన్ని పెంపొందించడంతో పాటు దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతారని అన్నారు.

సంఘ్ కార్యకలాపాలన్ని దేశం బాగు కోసం హిందు సమాజ రక్షణ కోసం ఉంటాయి. అయితే చాలా మంది సంఘ్‌ను ముస్లిం వ్యతిరేకిగా భావిస్తారని కాని అది అవాస్తవమని తెలిపారు. భారత్ మరోసారి విశ్వగురుగా మారుతుందని ఆ విధంగా సమాజాన్ని రూపొందించడం ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యతని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు.



# రాడికల్ నేత ఒస్మాన్ హాది అంత్యక్రియల్లో యూనస్ ప్రతిజ్ఞ

**ఢాకా:** బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ ముహమ్మద్ యూనస్ శనివారం రాడికల్ నేతగా పేరున్న షరీఫ్ ఒస్మాన్ హాది అంత్యక్రియల్లో పాల్గొన్నారు. హాది ఆలోచనలు, సిద్ధాంతాలను తరతరాలకు కొనసాగిస్తామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. గత వారం గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడి మరణించిన హాదికి వేలాదిమంది నివాళులు అర్పించారు. అంత్యక్రియల సందర్భంగా యూనస్ మాట్లాడుతూ.. ఇది వీడ్కోలు కాదు, ఒక ప్రతిజ్ఞ. హాది మాకు చెప్పిన మాటలను మేం నెరవేరుస్తాం. మా తరాలే కాదు, రాబోయే తరాలూ ఈ వాగ్దానాన్ని కొనసాగిస్తాయి. హాది ప్రజలతో మమేకమయ్యే తీరును, రాజకీయ దృక్పథాన్ని యూనస్ ప్రశంసించారు. ఆయన మానవత్వం, జీవన విధానం, రాజకీయ ఆలోచనలను దేశం ఎప్పటికీ మర్చిపోవని పేర్కొన్నారు. ప్రపంచం ముందు తల ఎత్తుకుని నడుస్తాం. ఎవరి ముందూ తలవంచం అని యూనస్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో పాల్గొనాలన్న హాది ఆశయాన్ని యూనస్ గుర్తు చేశారు. ఎన్నికల ప్రచారం ఎలా ఉండాలో ఆయన చూపిన మార్గాన్ని తాము స్వీకరించామని తెలిపారు. హాది ఇచ్చిన స్ఫూర్తి ప్రజాజీవితంలో సజీవంగా కొనసాగుతుందని చెప్పారు. 32 ఏళ్ల హాది బంగ్లాదేశ్‌లో 2024 విద్యార్థి ఉద్యమ సమయంలో వెలుగులోకి వచ్చాడు. అప్పటి ప్రధాని షేక్ హసీనా అధికారం కోల్పోవడానికి దారితీసిన ఆ ఉద్యమంలో ఆయన కీలకంగా వ్యవహరించారని చెబుతారు. ఇండియా వ్యతిరేక వ్యాఖ్యలతో హాది గుర్తింపు పొందాడు. ఢాకాలో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సమయంలో ఆయనపై జరిగిన కాల్పులకు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో సింగపూర్‌లో చికిత్స పొందుతూ హాది మృతి చెందాడు. ఈ ఘటనలో అనుమానితులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వారు భారత్‌కు పారిపోయి ఉండవచ్చని ఆరోపణలు వచ్చాయి. దాంతో న్యూఢిల్లీ-ఢాకా మధ్య దౌత్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. హాది మరణం తర్వాత ఢాకా సహా పలు నగరాల్లో భారీ నిరసనలు చెలరేగాయి. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. కొన్ని చోట్ల భవనాలకు నిప్పు పెట్టడంతో అక్కడి సిబ్బంది చిక్కుకుపోయిన ఘటనలు కూడా జరిగాయి.




# దక్షిణాఫ్రికాలో కాల్పుల్లో 10 మంది మృతి

దక్షిణాఫ్రికాలో మళ్లీ తూటా పేలింది. జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన ఆగంతకులు జరిపిన కాల్పుల్లో పది మంది మరణించారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అక్కడి అధికారులు వెల్లడించారు. ఆదివారం జొహన్నెస్‌బర్గ్ శివారులోని బెకర్స్‌డాల్ టౌన్‌షిప్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. మృతుల్లో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. కాల్పుల ఘటన తర్వాత ఆ ప్రాంత ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. సమస్యాత్మక ప్రాంతం కావడంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని అధికారులు అంటున్నారు. దక్షిణాఫ్రికాలో కఠినమైన ఆయుధ చట్టం అమల్లో ఉంది. ఫైర్‌ఆర్మ్స్ కంట్రోల్ యాక్ట్ 2000 ప్రకారం.. గన్ లైసెన్స్ పొందడానికి కంపిటెన్సీ టెస్ట్, బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్, పోలీసుల అనుమతి తప్పనిసరి. అలాగే ఆయుధాన్ని భద్రంగా ఉంచే చోటును కూడా పరిశీలిస్తారు. అయినప్పటికీ గన్ కల్చర్ ఆ దేశంలో పెద్ద సమస్యగా మారింది. సామూహిక కాల్పుల ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. దక్షిణాఫ్రికాలో నెల వ్యవధిలో జరిగిన సామూహిక కాల్పుల ఘటన ఇది. ఈ నెల 6న ప్రిటోరియా సమీపంలో అక్రమంగా మద్యం అమ్మే చోట దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో మూడేళ్ల చిన్నారితో సహా 12 మంది దాకా ప్రాణాలు కోల్పోయారు.

# ఆ రేట్లే బెటర్.. జనాలు థియేటర్లకు వచ్చేవారని అన్నారు





టాలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్ ఏదైనా ఉందంటే అది టికెట్ల రేట్ల అంశమే. పెద్ద సినిమాలు రిలీజైన ప్రతిసారి దీని గురించి చర్చ నడుస్తూనే ఉంటుంది. రీసెంట్‌గా 'అఖండ 2' వచ్చినప్పుడు కూడా రేట్ల పెంపుపై హైకోర్టు, తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సరే ఈ విషయం వదిలిస్తే ఇప్పుడు టాలీవుడ్ నటుడు, రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి.. ఇదే అంశంపై ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయమే బెటర్ అని డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు అంటున్నారని చెప్పుకొచ్చారు. 'ఓటీటీల రాకతో ప్రేక్షకులు సినిమాలు చూసే విధానం పూర్తిగా మారిపోయింది. అద్భుతమైన కంటెంట్ వాటిలో దొరుకుతోంది. డబ్బున్నవాడు ఓటీటీలో మూవీస్ చూస్తుంటే.. డబ్బులేనివాడు టీవీలో చూస్తున్నాడు. ఒకప్పుడు సినిమా అనేది ఏకైక ఎంటర్‌టైన్‌మెంట్ సాధనం. కానీ ఇప్పుడు చాలా ఉన్నాయి. అందులోనూ సినిమా.. చాలా ఖరీదైన ఎంటర్‌టైన్‌మెంట్‌గా మారిపోయింది. జగన్ మోహన్ రెడ్డి గారు అప్పట్లో టికెట్ రేట్లు తగ్గిస్తే వీళ్లందరూ వ్యతిరేకించారు. కానీ ఇప్పుడు వాస్తవానికి చాలామంది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో మాట్లాడినప్పుడు.. ఆ రేట్లే బెటర్ సర్, కనీసం జనాలు థియేటర్లకు వచ్చేవారు అని నాతో అన్నారు' 'ఈ రోజుల్లో సరసమైన ధరలకు తక్కువ రేట్లకు సినిమా చూపిస్తామని చెప్పుకోవడం పబ్లిసిటీ మెటీరియల్ అయిపోయింది. ఇంకొన్నాళ్లకు 1+1 ఆఫర్ ఇచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. టికెట్ కొంటే మరో టికెట్ ఫ్రీ అని.. జంటగా వచ్చి సినిమా చూడొచ్చని, గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి సినిమా చూడొచ్చని బోర్డులు పెట్టినా పెట్టొచ్చు. మనం చెప్పలేం. అలాంటి పరిస్థితి వచ్చేసింది' అని బీవీఎస్ రవి తన అభిప్రాయాన్ని చెప్పారు. ఈయన చెప్పినది చూస్తే జరుగుతున్నది, జరగబోయేది ఇదే కదా అనిపిస్తుంది. ఎందుకంటే రీసెంట్ టైంలో రిలీజైన లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి చిత్రాలకు రూ.99 టికెట్ అనే ప్రచారం చాలా ప్లస్ అయింది. ఇప్పటికైనా టాలీవుడ్ దర్శకనిర్మాతలు టికెట్ రేట్ల విషయంలో పునారాలోచన చేసుకోకపోతే మాత్రం రాబోయే రోజుల్లో ప్రేక్షకుడు.. థియేటర్‌కి పూర్తిగా దూరమయ్యే అవకాశముంది.



# అల్లు అర్జున్ తెలుగు సినిమా హీరో అని తెలియదు

టాలీవుడ్ యంగ్ హీరో రోషన్ కనకాల లేటెస్ట్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'ఛాంపియన్' డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో రోషన్ సరసన మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తుండగా... ఆమెకు ఇదే తొలి తెలుగు సినిమా కావడం విశేషం. ఇప్పటికే ట్రైలర్, టీజర్ మంచి రెస్పాన్స్ తెచ్చుకోగా, తాజాగా అనస్వర చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అనస్వర రాజన్... తాను చూసిన తొలి తెలుగు సినిమా బాలకృష్ణ నటించిన 'శ్రీరామరాజ్యం' అని చెప్పింది. అయితే ఆ సినిమా తెలుగులో తెరకెక్కిందన్న విషయం అప్పట్లో తనకు తెలియదని వెల్లడించింది. "మా నానమ్మ ఆ సినిమా చూస్తుండగా నేను చూశాను. కానీ అది తెలుగు సినిమా అని అప్పట్లో నాకు అర్థం కాలేదు" అని అనస్వర చెప్పింది. చిన్నప్పట్లో మలయాళంలో డబ్ అయిన అల్లు అర్జున్ సినిమాలు ఎక్కువగా చూసేదాన్నని, ఆ సమయంలో అల్లు అర్జున్ తెలుగు హీరో అని తనకు తెలియదని తెలిపింది. "అయన్ను మలయాళ హీరోనే అనుకున్నాను. ఆ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'మగధీర' సినిమా చూసినప్పుడే తెలుగు సినిమాలు, నటుల గురించి స్పష్టంగా తెలిసింది" అంటూ ఆమె చెప్పుకొచ్చింది. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు నెటిజన్లు సరదాగా స్పందిస్తుండగా... మరికొందరు మాత్రం అనస్వర నిజాయితీగా తన అనుభవాన్ని చెప్పిందని కామెంట్స్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, 'ఛాంపియన్' సినిమాతో అనస్వర రాజన్ తెలుగులోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రంలో ఆమె 'చంద్రకళ' పాత్రలో కనిపించనుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాను జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ కలిసి నిర్మించాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేతుల మీదుగా ఇటీవల ట్రైలర్ విడుదల కావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. డిసెంబర్ 25న విడుదల కానున్న ఈ సినిమాతో రోషన్, అనస్వర ఇద్దరికీ మంచి బ్రేక్ వస్తుందేమో చూడాలి.

# పేరు చెప్పలేను!




యూట్యూబ్ ఫ్రేమ్ నుంచి సినిమా ఫ్రేమ్ దాకా చేరిన నటి వైష్ణవి ప్రయాణం మాటల్లో సులభం, కాని మనసుల్లో మాత్రం అద్భుతం! ఆ మార్గంలో ఆమె చూసిన ఆనందాలు, నేర్చుకున్న పాఠాలు అన్నీ ఆమె మాటల్లోనే, మీ కోసం! హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన అమ్మాయిని నేను. చిన్నప్పటి నుంచే టీవీలో పాటలు వస్తే డ్యాన్స్ చేస్తూ, పుస్తకాలలో ఉన్న కథలను యాక్ట్ చేస్తూ ఉండేదాన్ని. అదే నన్ను యూట్యూబ్ వీడియోలు చేయించి, ఈరోజు సినిమాల దాకా తీసుకువచ్చాయి. నా కెరీర్ నిజంగా 'ది సాఫ్ట్‌వేర్ డెవలపర్' సిరీస్‌తో మలుపు తిరిగింది. ఆ సిరీస్ నాకు నటిగా నమ్మకం ఇచ్చింది. తర్వాత 'అల వైకుంఠపురములో' చిన్న పాత్రలో కనిపించాను. అవకాశం చిన్నదైనా, ఆ సినిమాలో కనిపించడం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. ఆ తర్వాత వచ్చిన 'బేబీ' సినిమా నా జీవితంలో ఒక అద్భుతం. ఆ సినిమాకు వచ్చిన ప్రేమ, గుర్తింపు, అవార్డులు ఇవన్నీ నాకింకా కలలా అనిపిస్తాయి. ఇష్టమైన హీరో ఎవరని అడిగితే, ఏ పేరూ చెప్పలేను. కాని, కష్టపడి ఎదిగిన నటులంటే చాలా గౌరవం. నేను పాతబస్తీ గల్లీలలో పెరిగిన అమ్మాయి కాబట్టి, ఆ ప్రదేశం ఇప్పటికీ నాకు హాయిగా అనిపిస్తుంది. తినే విషయానికి వస్తే నేనొక ఫూడీ. మసాలా నాన్ అయితే చాలు, చికెన్ ఉంటే ఇంకా ఇష్టం. టైమ్ దొరికితే సంగీతం వినడం, డ్యాన్స్ చేయడం, సినిమాలు చూడడం, ప్రయాణాలు చేయడం నాకు రిలాక్సేషన్‌లా ఉంటుంది. అందం గురించి చెప్పాలంటే, నేను చాలా సింపుల్. ఉదయం నీటితోనే ముఖం కడుక్కుంటాను. తేలికపాటి మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ వాడతానంతే! ఇదే నా రొటీన్. జుట్టు విషయంలో మాత్రం గోట్ మిల్క్ షాంపూ, హెయిర్ ఆయిల్ వాడతాను. ఫ్యాషన్ ట్రెండ్‌లు ఎలా ఉన్నా, నాకు కంఫర్ట్ ఇచ్చే దుస్తులే వేసుకుంటాను. చీరలు, అనార్కలి, లెహెంగాలు వేసుకోవడం చాలా ఇష్టం. గాసిప్స్ విషయానికి వస్తే, నా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడటం నాకు ఇష్టం ఉండదు. ప్రస్తుతం నేను సింగిల్‌నే. రూమర్స్ వచ్చినా వాటికి స్పందించకుండా నేను నా పనిపైనే దృష్టి పెడతాను. 'బేబీ' తర్వాత నా రెమ్యునరేషన్ పెరిగిందని చెబుతారు, కాని, నిజంగా పెరిగింది ప్రేక్షకులు ఇస్తున్న ప్రేమ, గౌరవం. ప్రస్తుతం ఒక ఎమోషనల్ స్టోరీ చేస్తున్నా. ఆ పాత్ర కూడా చాలా డీప్‌గా ఉంటుంది. ఇప్పుడే ఎక్కువగా చెప్పలేను. కాని, ఇది నా కెరీర్‌లో మరో ప్రత్యేక పాత్రగా నిలవడం ఖాయం. నన్ను గుర్తు చేసుకునేప్పుడల్లా నేను చేసిన మంచి పాత్రలే ముందుగా కనిపించాలి. అందుకే, చేస్తున్న ప్రాజెక్ట్స్ అన్నీ చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాను.

# కర్లీతోనే కష్టాలు!

రింగుల జుట్టుతో రంగుల ప్రపంచపు రారాణిగా వెలుగొందింది తాప్సీ పన్ను. అయితే, తన గ్లామర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆ కర్లీ హెయిర్.. కొన్ని సందర్భాల్లో తనకే చిక్కులు తెచ్చిపెట్టిందని చెబుతున్నది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన రింగుల జుట్టు కారణంగా అనేక అవకాశాలు కోల్పోయానని వాపోయింది. "సినిమాల్లోకి అడుగుపెట్టిన మొదట్లో.. నాకు స్టోరీ చెప్పడానికి వచ్చిన దర్శకులంతా నా జుట్టును సరిచేసుకోవాలని చెప్పేవారు. కేవలం స్ట్రెయిట్ హెయిర్‌తోనే గ్లామర్, స్టయిలిష్ లుక్ వస్తుందని ఆ దర్శకులు అనుకునేవారు.

ఇక రింగుల జుట్టు అంటే.. 'రెబల్ రూల్స్' అని భావించేవారు. కర్లీ హెయిర్ ఉన్న అమ్మాయిలు.. నెగెటివ్ పాత్రలకే పనికొస్తారనీ, సంప్రదాయబద్ధంగా ఉండే అమ్మాయిగా కనిపించలేరనీ చెప్పేవారు" అంటూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నది. అందుకే, సినిమా అవకాశాల కోసం మొదట్లో తన జుట్టును స్ట్రెయిట్ చేయించుకోవడానికి అంగీకరించిందట. అయితే, ఆ తర్వాత సినిమాలతోపాటు ప్రకటనల్లోనూ తన జుట్టును సరిచేయించుకోవాలని చెప్పేవారట. "నాతో యాడ్స్ చేయడానికి పెద్దపెద్ద బ్రాండ్స్ ఆసక్తి చూపించేవి. కానీ, నా రింగుల జుట్టును మార్చుకోవాలని చెప్పేవి. అలా, నేను సినిమాలతోపాటు చాలా యాడ్స్ కూడా రిజెక్ట్ చేశాను" అంటూ చెప్పుకొచ్చింది.

ఇక తన చిన్ననాటి ముచ్చట్లనూ పంచుకుంటూ.. "బాల్యంలో కర్లీ హెయిర్ ఉన్నవాళ్లు చాలా తక్కువగా ఉండేవారు. అందుకే, ఇలా ఉండటం అసాధారణమనే భావనలో ఉండేదాన్ని. అయితే, సరైన అవగాహన లేక రింగుల జుట్టుతో ఇబ్బందులు పడ్డా. చివరికి నా జుట్టును అర్థం చేసుకుని.. సరైన ఉత్పత్తులు వాడుతూ, సంరక్షించుకున్నా!" అంటూ గుర్తుచేసుకున్నది. 'ఝుమ్మంది నాదం' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది తాప్సీ. వరుస అవకాశాలు దక్కించుకుంటూ.. టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. ఆ తర్వాత బాలీవుడ్ బాటపట్టి.. అక్కడా వరుస హిట్స్ అందుకున్నది. పలు వెబ్ సిరీస్‌లలోనూ మెరిసింది. పెళ్లి తర్వాత సినిమాలు తగ్గించింది. చివరిసారిగా అక్షయ్ కుమార్ సరసన 'ఖేల్ ఖేల్ మే' చిత్రంలో కనిపించింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com